మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## రోగులకు మెరుగైన
# వైద్యం అందించాలి

**జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్**




వైద్యుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**గద్వాలటౌన్ జూలై 24, ప్రభాతవార్త:**ఆసుపత్రికి వచ్చేరోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు.గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రభుత్వ ఆసుపత్రులు, పీ.హెచ్.సీల పనితీరుపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపి శాతం ఎక్కువగా ఉండేలా వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది సమయపాలన పాటించేందుకు బయో మెట్రిక్ తప్పక అమలు చేయాలని, ఆసుప్రతిలో డెలివరీల సంఖ్యను పెంచేందుకు అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకుని, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హై రిస్క్ కేసుల హిస్టరీని పరిశీలించుకుని తగిన వైద్య సేవలను అందించాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోరిజిస్టర్లు పూర్తి స్థాయిలో ఉండాలని సూచించారు. రోగ నిర్ధారణలో లోపాలు లేకుండా ఉండేందుకు ల్యాబ్ టెస్టులు ఖచ్చితంగా,ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని అన్నారు.క్లిష్టమైన కేసులను వెంటనే జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయాలని తెలిపారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యాధుల పట్ల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.టీబీ ముక్త్ భారత్ కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ,క్షయ వ్యాధి నిర్మూలనకు జిల్లా స్థాయిలో చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు.ప్రోగ్రామ్ ఆఫీసర్లు,మల్టీ పర్పస్ హెల్త్ సూపర్వైజర్లు తప్పనిసరిగా ఫీల్డ్ విజిట్లు చేయాలని సూచించారు. స్వయంగా ఆకస్మికంగా పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సందర్శిస్తానని తెలిపారు. వైద్యారోగ్య శాఖ ద్వారా పెద ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి సిద్ధప్ప,మెడికల్ ఆఫీసర్స్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్,హెల్త్ సూపర్వైజర్స్,తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉమ్మడి జిల్లా
# పెన్షన్ అదాలత్

- **పెన్షన్లు, జీపీఎఫ్, అకౌంట్ సంబంధిత పెండింగ్ సమస్యలపై ఈనెల 25న కలెక్టరేట్ లో నిర్వహణ**
- **జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 24 ప్రభాతవార్త:** పెన్షన్లు, జీపీఎఫ్, అకౌంట్ సంబంధిత సమస్యలపై ఈ నెల 25న మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలనుండి సాయంత్రం 5గంటల వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపెన్షన్ అదాలత్,వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, జిల్లా స్థాయి పెన్షన్ కమిటీల ద్వారా పెండింగ్ పెన్షన్ కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి వీలుగా, జిల్లా కలెక్టర్ సమన్వయంతో పెన్షన్ అదాలత్,వర్క్ షాప్ నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలియజేశారు. అధికారుల స్పందన లేకపోవడం లేదా నిష్క్రియాత్మకత కారణంగా ఏర్పడిన దీర్ఘకాలిక పెన్షన్ కేసుల పరిష్కారంపై ఈ వర్క్ షాప్ /సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెన్షనర్ల ఫిర్యాదులను పరిష్కరించడం, ప్రతిపాదనలను వెంటనే సమర్పించడంలో శాఖాపరమైన అధికారులకు మార్గనిర్దేశం చేయడం, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయడం, పెన్షన్ సంబంధిత వ్యాజ్యాలను తగ్గించడం దీని లక్ష్యమని చెప్పారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఖాతాలు, పెన్షన్లు, జిపిఎఫ్ సంబంధిత సమస్యలు మరియు పెన్షన్/జిపిఎఫ్ అదాలత్ పై వర్క్‌షాప్ 25.07.2025 (శుక్రవారం) ఉదయం 10:30 నుండి సాయంత్రం 05:00 గంటల వరకు జరగనుంది. ఈ వర్క్‌షాప్ మహబూబ్ నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలను కవర్ చేస్తుంది. వర్క్‌షాప్ సందర్భంగా, అర్హత కలిగిన పెన్షనర్లు/చందాదారులకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్లు (పిపిఓలు) జిపిఎఫ్ అధికారాలు కూడా పంపిణీ చేయబడతాయి. పైన పేర్కొన్న అన్ని దృష్ట్యా, జిల్లాలోని విభాగాధిపతులు (జతపరచబడిన జాబితా ప్రకారం) తమ శాఖ నుండి పెన్షన్ విషయాలను నిర్వహించే కనీసం ఒక అధికారిని వర్క్‌షాప్‌కు తప్పకుండా హాజరు కావాలని మరియు జిల్లా ట్రెజరీ/సబ్‌ట్రెజరీ అధికారులు పైన పేర్కొన్న వర్క్‌షాప్ మరియు అదాలత్‌కు సంబంధిత రికార్డులు, సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ప్రజలను, పెన్షనర్లను మరియు పెన్షనర్ల సంఘాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పైన పేర్కొన్న విషయంలో ఏదైనా అలసత్వం ఉంటే దానిని తీవ్రంగా పరిగణిస్తామని జిల్లాలోని అన్ని జిల్లా అధికారులకు ఆమె సూచించారు.

## ఊట్కూర్ అంగన్వాడీ సెంటర్‌పై ట్రైనీ కలెక్టర్ ఆగ్రహం

**ఊట్కూర్, జూలై 24 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ సెంటరుకు వెళ్లి అక్కడే విద్యార్థుల హాజరు రిజిస్టర్ను పరిశీలించారు. రిజిస్టర్లో నమోదు చేసిన విద్యార్థులకు సెంటర్లో ఉన్న విద్యార్థులకు పొంతనలేదని నిర్వాహకురాలు జయ దేవిని ప్రశ్నించారు. గది అంధకారంగా ఉందని మెయింటెనెన్స్ డబ్బులతో ఒక విద్యుత్ బల్బు ఏర్పాటు చేసుకోలేరా అని అంగన్‌వాడి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



అంగన్‌వాడి నిర్వాహకులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

## 9 వంతెనలు..
# రూ.44.10కోట్లు

**జడ్చర్ల నియోజకవర్గంలో ఏర్పాటుకు చర్యలు మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**

**జడ్చర్ల, జూలై 24 ప్రభాతవార్త :** జడ్చర్ల నియోజకవర్గంలో తొమ్మిది ప్రాంతాల్లో వంతెనలు కట్టడానికి గత ఏడాదిలో తాను చేసిన ప్రతిపాదనల కోసం అవసరమైన రూ.44.10 కోట్లను వెంటనే మంజూరు చేసి, వంతెనల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కోరామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. అనిరుధ్ రెడ్డి గురువారం మంత్రి సీతక్కను కలిసి గతంలో తాను ప్రతిపాదించిన వంతెన నిర్మాణాలకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరామని మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది జూన్ నెలలో తాను జడ్చర్ల నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో వంతెనలు నిర్మించాల్సిన అవసరమున్న ప్రాంతాలను గుర్తించి వీటి నిర్మాణానికి నిధులను కేటాయించాల్సిందిగా కోరామని గుర్తు చేసారు. ఈ విషయంగా చర్యలు తీసుకోవాల్సిందిగా సీతక్క పంచాయితీరాజ్ ఈఎన్సీకి ఆదేశించడంతో దీనికి సంబంధించిన అధికారిక ప్రక్రియ మొదలైయిందని అనిరుధ్ రెడ్డి చెప్పారు. జడ్చర్ల మండలం లింగంపేట నుంచి నల్లకుంట



మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న అనిరుధ్ రెడ్డి

తాండాకు వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణానికి రూ.4.50 కోట్లు, ఎక్వాయిపల్లి నుంచి లింగంధన వెళ్లే మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు, నెక్కొండ నుంచి బైరంపల్లి వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణానికి రూ.4.50 కోట్లు, కొండేడు నుంచి తుపడగడ్డ తాండా మార్గంలో వంతెన నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. అలాగే బాలానగర్ మండలంలో జాతీయ రహదారి నుంచి ఉడిత్యాల, మోతీఘనపూర్, సూరారం మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు, శేరిగూడ నుంచి బోడజానంపేట్ కు వెళ్లే రోడ్డులో వంతెన నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేయాల్సిందిగా ప్రతిపాదించామని చెప్పారు. నవాబుపేట మండలంలో వీరశెట్పల్లి నుంచి దయాపంతులపల్లి మీదుగా హాజీపూర్ వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణానికి రూ.2.40 కోట్లు ప్రతిపాదించామన్నారు. రాజాపూర్ మండలంలో రాయపల్లి నుంచి కుచ్చర్కల్ వెళ్లే రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి రూ.6 కోట్లు, మిడ్జిల్ మండలంలో వల్లభరావుపల్లి నుంచి చౌటకుంటతాండా మీదుగా వేముల వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణానికి రూ.10.20 కోట్ల చొప్పున మొత్తం తొమ్మిది వంతెనల కోసం రూ.44.10 కోట్లు మంజూరు చేయాల్సిందిగా ప్రతిపాదించామని అనిరుధ్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రక్రియ గత ఏడాదిలోనే మొదలైయిందన్నారు. అయితే ఈ ప్రాంతాల్లో వంతెనలు లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతుండటం, ముఖ్యంగా వర్షాకాలంలో ప్రమాదాలు కూడా సంభవిస్తుడటంతో ఈ వంతెనలకు నిధుల మంజూరు ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, వాటి నిర్మాణాను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా తాను మంత్రి సీతక్కను కలిసి కోరామని వివరించారు. సానుకూలంగా స్పందించిన సీతక్క దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారని వెల్లడించారు. వంతెనల నిర్మాణ పనులు కూడా త్వరలోనే ప్రారంభమోతాయని అనిరుధ్ రెడ్డి తెలిపారు.



శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకుంటున్న భక్తులు

## శ్రీ కురుమతి కొండకు
# పోటెత్తిన భక్తజనం

**చిన్న చింతకుంట, జూలై 24 ప్రభాతవార్త :** తిరుమల వెంకటేశ్వరుడి ప్రతిరూపంగా కొలవబడుతూ పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి కొండకు భక్తులు పోటెత్తారు.గురువారం ఆషాడ మాసం ముగిసి శ్రావణమాసం ప్రారంభమయ్యే అమావాస్య కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కాలినడకన స్వామివారి కొండకు ఉదయాన్నే చేరుకున్నారు.ముసురు వర్షాన్ని లెక్కచేయకుండా భక్తులు కొండ దిగువన నుంచి క్యూలైన్లలో బారులు తీరి స్వామివారి సన్నిధి వరకు చేరుకున్నారు. భక్తుల గోవింద నామస్మరణతో కురుమతి గిరులు పులకరించిపోయాయి. స్వామివారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు తీర్చే శ్రీ కురుమతి రాయుడుని భక్తులు విశ్వసిస్తారు. మెట్టు మెట్టుకు కొబ్బరికాయ కొట్టుతూ, దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్నదానాన్ని ఏర్పాటు చేసినట్లు పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, బాదం వెంకటేశ్వర్లు, నాగరాజులు తెలిపారు.

# ఫ్రైడే డ్రై డే పక్కగా నిర్వహించాలి..

- **డెంగ్యూ కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీగా చర్యలు**
- **ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి**
- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి..**

**వనపర్తి, జూలై 24 ప్రభాతవార్త :** వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని, నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కొత్తకోట మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ.డి.డి రిజిస్టరు, ల్యాబ్ ఇన్వెస్టిగేషన్ రిజిస్టరు పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, ప్రతి గర్భిణీ ఎఎన్‌సి నమోదు పక్కగా ఉండాలని సూచించారు. ప్రసవం రోజులు దగ్గర పడినప్పుడు ఆశావర్కర్లు అందుబాటులో ఉండి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరుగుచున్న సి సెక్షన్‌లు, అబార్షన్ల పై దృష్టి పెట్టి నియంత్రించాలని మెడికల్ సిబ్బందిని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల కారణంగా జలుబు, జ్వరంతో వచ్చే రోగులందరికీ డెంగ్యూ, మలేరియా వంటి రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వచ్చే జ్వరం కేసుల నివేదిక తీసుకొని వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తకోటలో గత సంవత్సరం డెంగ్యూ కేసులు ఎక్కువగా వచ్చాయని, వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.



ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ (ఇన్‌సెట్లో) డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఫ్రైడే రోజు డ్రైడే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో నీటి నిల్వ లేకుండా, పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. కొత్తకోట మున్సిపాలిటీలో బస్తీ దవాఖాన కొరకు భవనం చూడాలని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌ను ఆదేశించారు. కొత్తకోట పెబ్బేరు జాతీయ రహదారి మిరాసపల్లి వద్ద మహిళా సంఘాల పెట్రోల్ బంక్‌కు స్థల పరిశీలన మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ కేటాయిస్తున్న నేపథ్యంలో కొత్తకోట పెబ్బేరు మధ్య మిరాస్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకునేందుకు స్థలం పరిశీలించారు. జాతీయ రహదారి పై ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పెట్రోల్ బంక్ కు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

వెంటనే డి.పి.ఆర్ సిద్ధం చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ పిడి ఉమాదేవిని ఆదేశించారు. పెద్దగూడెం గ్రామ శివారులో నడుస్తున్న జ్యోతిబా పూలే వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ జ్యోతిబా పూలే వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించిన కలెక్టర్ సరైన వసతులు లేకపోవడమే కాకుండా అధికంగా అద్దె చెల్లిస్తుండటంతో వనపర్తి పట్టణం నాగవరం పరిధిలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ (వై.టి.సి) భవనానికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని డి.ఆర్డీఓను సూచించారు. జిల్లా వైద్య అధికారి డా. శ్రీనివాసులు, తహసిల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ సైదయ్య, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సాయినాథ్ రెడ్డి, డా. పరిమళ, మెడికల్ ఆఫీసర్, పిడి డిఆర్‌డిఓ ఉమాదేవి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలు ఖాయం

**ఓట్ల కోసం వస్తె కాంగ్రెస్ హామీలపై ప్రజలు నిలదీయాలి**

**మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజేందర్ రెడ్డి**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి, జూలై 24 ప్రభాతవార్త:**నియోజకవర్గంలోని మరికల్ మండల కేంద్రంలో తిరుమల ఫంక్షన్ హాల్లో జరిగిన మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాజీ శాసనసభ్యులు, జిల్లాపార్టీ అధ్యక్షులు యస్.రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ వాళ్లు రాబోయే రోజుల్లో మీ ఇంటి దగ్గరికి ఓటు వెయ్యండని అడగడానికి వచ్చినప్పుడు ఎన్నికల్లో మీరిచ్చిన ఆరు గ్యారంటీలు నెరవేర్చారా మాకు నెరవేర్చిన తరువాత ఓట్లు అడగండి అని నిలదీయండి మీకు ఎందుకు ఓటు వేయాలని అడగండి. మీరు ఇచ్చిన ఆరు గ్యారంటీలే కాక 420 దొంగ హామీలు ఇచ్చి మమ్ములను మోసం చేశారు. మీరే ఇచ్చిన గ్యారంటీలు హామీలను నెరవేర్చలేని అసమర్థ ప్రభుత్వానికి ఓటు ఎందుకు వేయాలి. ఇప్పటికే ప్రజలు మోసపోయారు అన్నారు కావున రాబోయే స్థానిక ఎన్నికలలో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలుపుకోరకు కార్యకర్తలు గట్టిగా పనిచేయాలని సూచించారు. మరికల్ మండలాన్ని అభివృద్ధిలో వెనకబడి పోయినారు అన్ని మన ప్రభ్యుత్వంలో చేసిన అభివృద్ధి కనిపిస్తుంది. మీ గ్రామాలలో మీరు ప్రజల్లో ఉండి వారికి మన ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి చెప్పండి. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో సర్పంచ్లు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలని గట్టి కృషి, పట్టుదలతో పని చేయాలన్నారు. ఇట్టి కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యువ నాయకులు, సోషల్ మిడియా సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి: కలెక్టర్

**గద్వాల టౌన్ , జూలై 24, ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదివి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు.గురువారం గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,విద్యార్థులు చదువుపై నిబద్ధతతో శ్రద్ధ చూపితే ఏ లక్ష్యమైనా చేరుకోవచ్చని అన్నారు.విద్యార్థులు ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల మాటలను పాటిస్తూ క్రమశిక్షణతో కష్టపడి చదివితే,ఉన్నత స్థాయికి చేరగలరని అన్నారు. ఒక చిన్న గ్రామం నుంచి చదువుతోనే ఐఏఎస్ స్థాయికి చేరినట్టు పేర్కొంటూ,ఎక్కడి నుంచి వచ్చామన్నది కాదు కన్న కలల ను కృషితో విజయాన్ని సాధించాలన్నారు. గతేడాది రాష్ట్రంలో 32వ స్థానంలో ఉన్న గద్వాల జిల్లా,ఈ సంవత్సరం 26వ స్థానానికి చేరి 10.36 మెరుగుదల




విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ బి.ఎం. సంతోష్

సాధించినట్లు తెలిపారు.పదవతరగతి విద్య భవిష్యత్తుకి పునాది కనుక ఇప్పుడే దృష్టి పెట్టాలని, ఎంతసేపు చదువుతామన్నది కాదు,ఎంత శ్రద్ధగా చదువుతున్నామన్నదే ముఖ్యమనీ స్పష్టం చేశారు.విద్యార్థుల ఫలితాలు మెరుగుపడేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వారం జిల్లాలో పాఠశాలలను క్షేత్రస్థాయిలో సందర్శించి, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అవసరాలను తెలుసుకొని, విద్యారంగంలో వారు ముందుకు సాగేందుకు నిరంతరం తగిన చర్యలు తీసుకుతుంటామని తెలిపారు.ఈ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లు, భవనాల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఏడాది కనీసం 90 శాతంపై మార్కులతో 20 మందిపై విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. మంచి ఫలితాలు సాధించిన వారిని స్వాతంత్ర్య దినోత్సవం,గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఘనంగా కలెక్టరేట్ లో సత్కరిస్తామని అన్నారు.1933లో స్థాపితమైన ఈ పాఠశాల,2033 నాటికి వందేళ్లు పూర్తవుతుందన్నారు.ఇక్కడి నుంచే ఎస్‌బీఐ ఛైర్మన్ వంటి గొప్ప వ్యక్తులు ఎదిగినట్లు గుర్తుచేస్తూ, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు కూడా భవిష్యత్తులో గొప్ప స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.చదువుతో పాటు శారీరక ఆరోగ్యం కూడా అవసరమని,విద్యార్థులు ప్రతి రోజు వ్యాయామం చేయాలని సూచించారు. తల్లిదండ్రుల కృషిని వృథా చేయకుండా చదువుపై పూర్తిగా దృష్టి పెట్టాలని, ప్రతి విద్యార్థి రోల్ మోడల్‌గా ఎదగాలని కలెక్టర్ హితబోధ చేశారు. విద్యార్థుల కోసం లాంగ్వేజ్ మెటీరియల్ రూపొందించి అందించిన హెల్పింగ్ హాండ్స్ కలెక్టర్ హర్షం వ్యక్తం చేసి,ట్రస్ట్ చైర్మన్ రత్నసింహారెడ్డిని అభినందించారు. ఈ మెటీరియల్‌ను ఉపయోగించి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ చారిటీ ట్రస్ట్ చైర్మన్ రత్న సింహరెడ్డి,మండల విద్యాధికారి శ్రీనివాసులుగౌడ్,ప్రధానోపాధ్యాయులు రేణుకదేవి,ట్రస్ట్‌సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలి : కలెక్టర్

**గండీడ్ జూలై 24,ప్రభాతవార్త;** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులు ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం గండీడ్ మండలంలో జానంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంను కలెక్టర్ పరిశీలించారు.గ్రామంలో 76ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 40 ఇండ్లు బేస్ మెంట్ వరకు,18 ఇండ్లు గోడలు పూర్తి అయి స్లాబ్ వరకు వచ్చినట్లు, 9 ఇండ్లు స్లాబ్ పూర్తి అయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇందిరమ్మ ఇల్లా లబ్ధిదారురాలు జ్యోతితో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ని చదరపు అడుగులలో నిర్మించారని అడిగారు. 530 చదరపు అడుగులలో నిర్మించినట్లు లబ్దిదారురాలు కలెక్టర్‌కు వివరించారు. ఇంటి నిర్మాణంకు దశల వారీగా డబ్బులు వచ్చాయా అని కలెక్టర్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటినిర్మాణం దశలఆధారంగా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం జరుగుతుం



గండీడ్ పి హెచ్‌సినీ ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

దని తెలిపారు. ఇల్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ నేరుగా కలిసి, వారు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. ఇలా నిర్మాణం చేపట్టేలా మండల స్థాయి అధికారులు లబ్ధిదారులకు ప్రోత్సహించాలని, ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకు రావాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు కృషి చేయాలన్నారు. అంగన్వాడి కేంద్రంను తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో మొక్కను నాటారు. అంగన్వాడి కేంద్రంలో ఎంత మంది పిల్లలు ఉన్నారు అని? రోజుకు ఎంతమంది గర్భిణీ స్త్రీలు వస్తున్నారు అని? వారి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రంలో వారి కోసం వండిన పోషక ఆహారాన్ని పరిశీలించారు.గండిడ్ మండలంలో పి.హెచ్.సి.ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ.పి. నమోదు పరిశీలించారు. పి.హెచ్.సిలో లేబర్ రూం పరిశీలించారు. గర్భిణీ స్త్రీలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల పి.హెచ్.సి లో నిర్వహించే ప్రసవాల గురించి తెలుసుకున్నారు. గత నెల13, ఈ నెల ఇప్పటివరకు 7 ప్రసవాలు జరిగాయని వైద్య అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ వైద్యులకు సూచించారు. వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. పి.హెచ్.సి కి వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. గండీడ్ – మిగతా4లో..

## భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**అధనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ**

**గద్వాల టౌన్ జూలై 24, ప్రభాత వార్త:** భూభారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేవిధంగా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ నారాయణ ఆదేశించారు. గురు వారం స్థానిక తహసిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్నచర్యల గురించి తహసిల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. రోజువారి లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిర్ణీత గడువులోగా అన్ని దరఖాస్తులను మాడ్యూల్స్ ప్రకారం పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. భూభారతి అమలులో పూర్తి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల జారీ కోసం స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించుకుని అర్హులైన వారికి గుర్తించి ఆమోదించాలన్నారు. ఇట్టి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో రెవెన్యూ అధికారులను ఆదేశాలు జారీ చేస్తున్న అధనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ మల్లికార్జున్

## స్థానిక ఎన్నికలలో అధికార పార్టీని నిలదీయాలి

**మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి**

**ఖిల్లా గణపురం జులై 24, ప్రభాతవార్త:** రాబోయే స్థానిక ఎన్నికలలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని వనపర్తి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి తాజా మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కేటీఆర్ బర్త్ డే సందర్భంగా కార్యకర్తల సమక్షంలో కేకును కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి కార్యకర్త తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విధంగా సైనికుల మాదిరిగా పనిచేసే సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలలో తెలంగాణ జెండా ఎగిరే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. శాసనసభ ఎన్నికలలో అనేక అమలు కాని పథకాలను ప్రకటించారని వాటిని అమలు చేయలేకపోయారని వాటిపై నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య పీన నాయక్ సురేందర్ రంగారెడ్డి దొర గొడుగు సత్యం బుచ్చిబాబు గౌడ్ సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణయ్య గౌడ్, రామచంద్రయ్య, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరి మాత ఉత్సవాలు

**ఆత్మకూర్ జూలై 24, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని తిప్పడం పల్లి గ్రామంలో గురువారం రోజు అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో నిర్మించేటువంటి చౌడేశ్వరి మాత ఆలయంలో ఘనంగా ఉత్స వాల నిర్వహించారు. ప్రతి సంవత్సరం చౌడేశ్వరి మాత జయంతి ఉత్స వాలను పురస్కరించుకొని గురువారం రోజు ప్రత్యేకంగా అలంకరించినటువంటి దేవాలయాన్ని ఉదయం 6 గంటలకే కృష్ణానది జలాల చేత జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు ఆత్మకూరు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు కోటేశ్వర్ ఎంపీటీసీ సభ్యులు భీమన్న తదితరులు చౌడేశ్వరి మాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షులు షీలా బాల రావు ఆధ్వర్యంలో పలువురిని ఘనంగా సత్కరించి సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఎఫ్.పి.ఓ ద్వారా రైతులకు మేలు

**డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్ రెడ్డి**

**రాజాపూర్, జూలై 24 ప్రభాతవార్త:** ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఎఫ్పీవో ద్వారా అన్నదాతలకు ఎంతో మేలు చేకూరుతుందని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం రాజాపూర్ మండలకేంద్రంలో ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ రాష్ట్రానికే ఎక్కువ ఎఫ్పిఓవోలు వచ్చినట్టు తెలిపారు. 750 మంది రైతులు ఒక్కో రైతు రూ.2000ల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని అవి 15 లక్షల ఎఫ్ డి ఓగా అవుతాయని, లిక్విడి కింద కేంద్ర ప్రభుత్వ మరో 15 లక్షలు జమ చేస్తుందని ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మొత్తంగా ఈ 30 లక్షల రూపాయలను రైతులు వ్యవసాయ రంగాల్లో వివిధ పనిముట్లకు ఉపయోగించుకోవచ్చని ఆయన తెలిపారు. అలాగే ఎఫ్పీవోలు లాభాల్లో ఉంటే ప్రభుత్వం కోటి నుండి రెండు కోట్ల వరకు రుణం అందజేస్తుందని ఈ సందర్భంగా డిసిఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షులు మేకల శ్రీశైలం యాదవ్, నాయకులు నరసింహ నాయక్, వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి**

**ఖిల్లా గణపురం జులై 24, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అని జెడ్పిటిసి తోపాటు ఎంపీటీసీ స్థానాలలో పోటీ చేస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో మండల బిజెపి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంపీటీసీ ఎన్నికలకు మండల ఇన్చార్జిగా బిజెపి అధిష్టానం ఏర్పాటు చేసిందని కార్యకర్తలం దరూ అన్ని ఎంపిటిసి స్థానాలలో పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ వారికున్న హోదాను బట్టి ఎంపీటీసీ స్థానాల్లో నిలపడానికి కూడా కృషి చేస్తాం అన్నారు. అధికార కాంగ్రెస్‌పార్టీ కల్లబొల్లి మాటలు చెప్పి శాసనసభఎన్నికల్లో గెలిచిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఎన్నికలప్పుడే రైతు పెట్టుబడి, సంక్షేమ కార్యక్రమాలను హడావిడి చేస్తుందని గత మూడు నెలల క్రితం వారి ధాన్యాన్ని కొనుగోలు చేసి ఇంతవరకు బోనస్ డబ్బులు రైతులకు ఇవ్వలేదని స్థానిక సంస్థల నోటిఫికేషన్ వస్తుంది అంటే ఒక రోజు ముందు మళ్ళీ బోనస్ అంటూ రైతులను మోసం చేస్తున్నారు. గ్రామాలలో కలియ తిరుగుతూ ఓటర్లందరికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని తెలియజేసి ఓట్లు రాబట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబిసి, జిల్లా అధక్షుడు బి ఆశన్న, విక్రమ్, గోపి, సత్యనారాయబుచ్చిబాబు, కార్యకర్తలుపాల్గొన్నారు.

### పాలమూరు ఎన్నారై ఆధ్వర్యంలో

## విద్యార్థులకు చెస్ బోర్డులు పంపిణీ

**దేవరకద్ర, జూలై 24 ప్రభాతవార్త:** పాలమూరు ఎన్నారై ఫోరం చెస్ నెట్వర్క్ టీం ఆధ్వర్యంలో గురువారం దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, దేవరకద్ర బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు 164 చదరంగం బోర్డులతో పాటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ చెస్ చదరంగం బోర్డులతోపాటు పుస్తకాలను పంపిణీ చేసిన దాతలు శివారెడ్డి, తిరుపతిరెడ్డి, రఘువీర్‌లకు పాఠశాల ఉపాధ్యాయ బృందం, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఎన్ఆర్ఐ ఫోరం కన్వీనర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ చెస్ అనేది అనేక ప్రయోజనాలను అందించి, మేధో సంపత్తిని పెంపొందించే మనోహరమైన క్రీడా అన్నారు. ఈ చెస్ క్రమం తప్పకుండా ఆడడం వల్ల వ్యక్తుల యొక్క దృక్కోణం, జ్ఞాపక శక్తి, పెరుగుతుంది. చెస్ ఆడడంలో నైపుణ్యం కలిగిన వారు ఇతరులతో పోలిస్తే మానసిక చురుకుదనం ఎక్కువగా కలిగి ఉంటారని కన్వీనర్ మహిపాల్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు ఎన్నారై ఫోరం వ్యవస్థాపకులు రామ్‌రెడ్డి, చెస్ నెట్వర్క్ టీం సుధీర్, సంజయ్, రాజన్న, హరిరాజ్, మండల విద్యాధికారి బలరాం, ప్రభుత్వ బాలికల ఉన్నత ప్రధానోపాధ్యాయురాలు నాగేంద్రమ్మ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులకు చెస్‌బోర్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## బిఆర్ఎస్ నాయకుడ్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**బిజినేపల్లి, జూలై 24 ప్రభాతవార్త:** అల్లిపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుడు మలిశెట్టి కృష్ణయ్యను మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి గురువారం పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలై హైదరాబాద్ సిటీ న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి కృష్ణయ్యకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. కుటుంబ సభ్యులతోమాట్లాడి ధైర్యంగా ఉండాలని కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. మర్రి వెంట మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పులేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నరెడ్డి, పార్టీ నాయకులు శేఖర్ రావు తదితరులు ఉన్నారు.



కృష్ణయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

# గుంతల మయంగా కౌకుంట్ల పుట్టపల్లి రోడ్డు

### రోడ్డును బాగు చేయండి సారు... ఎండ్ల తరబడి ఇదే గోష పడుతున్నాం

### ప్రమాదాల బారిన ప్రయాణికులు

**దేవరకద్ర, జూలై 24 ప్రభాతవార్త:** గుంతలు పడి కంకర తేలిన, రోడ్డుపై ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పది సంవత్సరాలుగా రోడ్డు మరమ్మత్తు దశలోనే ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కౌకుంట్ల మెయిన్ రోడ్ నుండి పుట్టపల్లి రైల్వే గేట్ వరకు వెళ్లే రోడ్డు పరిస్థితి అద్వానంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసిన ఆ గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం కురిసినప్పుడు ఆ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డును మరమ్మత్తులు చేసేలా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోండి. ఏండ్ల తరబడి ఇదే గోష పడుతున్నాము సారు... జర మా బాధ అర్థం చేసుకోండి అని రైతులు, ప్రయాణికులు, గ్రామ ప్రజలు వాపోతున్నారు. గత పది సంవత్సరాల కిందట కౌకుంట్ల రోడ్డు ప్రక్కన ఒక ప్రైవేట్ గోదాం కంపెనీ ఏర్పాటు చేయడం వల్ల, రైల్వే అధికారులు రైల్వే గేటును మూసివేశారు. రైల్వే గేటు మూయడం వల్ల రైల్వే అధికారులు రోడ్డును అక్కడినుండి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పుట్టపల్లి రైల్వే గేటు వరకు రోడ్డును మళ్ళించారు. కౌకుంట్ల మండల ప్రజలు, రైతులు, వందల ఎకరాలు ఉన్న మా పొలాలు మూతపడ్డ రైల్వే గేటు పక్కనే ఉన్నాయి. మా పొలాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం నుండి తిరిగి వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడ్డది. మాకు గేటు తెరిపించి, మా పొలాలకు వెళ్లే దారి చూపించండి సారు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుంతలమయంగా రోడ్డు

### ఈ రోడ్డు ఎవరిది మహాప్రభో...



కొన్ని సంవత్సరాల నుండి రోడ్డు పూర్తిగా గుంతల మాయమైంది. సాహసం చేసి వాహనాలు నడిపిన స్కిడ్ అయి కిందపడి గాయపడుతున్నారు. అటు ఆర్ అండ్ బి అధికారులను అడిగిన, ఇటు రైల్వే అధికారులను అడిగిన మాకు తెలియదు అని సమాధానం చెబుతున్నారు. ఇంతకు ఈ రోడ్డు ఎవరిది మహాప్రభో అర్థం కావడం లేదు. వర్షాకాలంలో వర్షపు నీటితో నిండిన, గుంతలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు స్పందించకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి.

గొల్ల ఆంజనేయులు, కౌకుంట్ల

### ఒక్కసారి కూడా రోడ్డును మరమ్మత్తు చేపట్టలేదు



కౌకుంట్ల మెయిన్ రోడ్డు నుండి పుట్టపల్లి రైల్వే గేట్ వరకు ఒక్కసారి కూడా ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. ఈ రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో పాటు, ఈ రోడ్డు గుండా మా పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది. వర్షాకాలం వచ్చిందంటే ఇది నీటితో నిండిపోతుంది. ఇక్కడ ఒక చోటే కాదు. రహదారి పొడవునా ఇదే పరిస్థితి ఉంది. వర్షాకాలంలో కనీసం గుంతలు కూడా పూడ్చలేని దైన్య పరిస్థితి ఉంది. ఇంతకుముందు ఉన్న రోడే మాకు బాగుండే, మా పొలాలకు దగ్గరగా ఉండేది. త్వరగా మా సమస్యకు పరిష్కారం చూపండి.

కురువ రవి, కౌకుంట్ల

### ఎన్నాళ్ళీ అవస్థలు..



పుట్టపల్లి రైల్వే గేటు మీద ప్రయాణం దుర్భరం. ఈ రోడ్డుమీద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డు చాలా కాలంగా ఇట్లాగే ఉంది. వర్షం వస్తే ఇది నీటితో నిండిపోతుంది. వాహనదారులు గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. పలుచోట్ల తారు కొట్టుకుపోయి కంకర తేలింది. ఈ మార్గంలో 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. బస్సులు నడపాలంటే డ్రైవర్లు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఉన్నత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాము.

శేఖర్, పుట్టపల్లి

## ఆగ్మార్క్ నియమాల ప్రకారం కోడిగుడ్లు సరఫరా చేయాలి

**గద్వాల టౌన్ జూలై 24, ప్రభాత వార్త:** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్‌పాఠశాలలు, కళాశాలలకు ఆగ్మార్క్ నియమాల ప్రకారం కోడిగుడ్లు సరఫరా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు తెలిపారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు కోడి గుడ్ల కొనుగోలుకు జిల్లా స్థాయి టెండర్ ప్రీబిడ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్స్ వంటి సంస్థలకు (మధ్యాహ్న భోజన పథకం మినహా) ఒక సంవత్సరం పాటు గుడ్ల సరఫరా కోసం టెండర్ ప్రక్రియ నిర్వహించబడుతుందని తెలిపారు. 2025.26 విద్యా సంవత్సరంలో అవసరమయ్యే 1 కోట్ల 34లక్షల 16వేల 862 గుడ్లను సరఫరా చేసేందుకు ఆన్లైన్ ద్వారా టెండర్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 22 నుండి 30 తేదీ సాయంత్రం 5 గంటల వరకు బిడ్ డాక్యుమెంట్లను డౌన్లోడ్ చేసుకుని అంతర్జాలంలో బిడ్లను సమర్పించాలన్నారు. సమర్పించిన బిడ్ల హార్డ్ కాపీలను జూలై 30 తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐడీఓసీ, హాల్ ఎఫ్8ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. జూలై 31 మధ్యాహ్నం 3:000 గంటలకు టెక్నికల్ బిడ్లను తెరవడం జరుగుతుందని, ఆగస్టు 1 ఉదయం 11:00 గంటలకు ధరల బిడ్ తెరవడం జరుగుతుందని తెలిపారు. పౌల్ట్రీ రంగంలో అనుభవం ఉన్న తెలంగాణ రైతులకే ఈ టెండర్‌కు అర్హులని, ఆగ్మార్క్, ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ, ఐ.ఎస్.ఓ 22000:2018 సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. గడిచిన 3 సంవత్సరాలలో కనీసం ఒక్క ఏడాది ..15 కోట్ల గుడ్ల సరఫరా అనుభవం ఉండాలని, ప్రతి సంవత్సరం 4 కోట్ల టర్నోవర్, 40 ఉత్పత్తి స్వంతంగా ఉండాలన్నారు. గరిష్టంగా 8 జిల్లాలకు దరఖాస్తు చేయవచ్చని, టెండర్ ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని దరఖాస్తులు ద్వారా డిజిటల్ సంతకంతో సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, డీడబ్ల్యూఓ సునంద విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధనపు కలెక్టర్ నర్సింగ రావు

## హామీలు అమలు చేయని కాంగ్రెస్‌ను తరిమికొడదాం: మాజీ ఎంపీపీ

**ఆత్మకూర్ జూలై 24, ప్రభాతవార్త:** గత శాసనసభ ఎన్నికల సమయంలో అమలు కానీ హామీలను ఇచ్చి హామీలు అమలు చేయకుండా కలయాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తరిమి కొడదామని ఆత్మకూర్ మాజీ మండల పరిషత్ అధ్యక్షులు బంగారు శ్రీనివాసులు టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ తదితరులు విజ్ఞప్తి చేశారు. గురువారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని టిఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన 20 నెలల నుండి కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పలు హామీలు గుప్పించి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు. మరో నెల రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో రైతుబంధు నిధులను మరియు మహిళలకు 2500 రూపాయలు చెల్లించే విషయంపై నిర్ణయాలు తీసుకుంటున్నామంటూ ప్రకటించడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. ఇప్పటికే గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి క్యాడర్ కూడా దూరమైందని కాంగ్రెస్ కార్యకర్తలు సైతం తీవ్ర అసంతృప్తిలో ఉన్న నేపథ్యంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటే ఎందుకు తమ వంతు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరేశలింగం శ్రీధర్ గౌడ్ జానకి రాములు, కొత్తబోయే శేఖర్ మాజీ కౌన్సిలర్లు మండల రామకృష్ణ తబస్సుం బేగం కోటేశ్వర్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కేటీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న టిఆర్ఎస్ పార్టీ నాయకులు

## ఉమ్మడి జిల్లా పెండింగ్ ప్రాజెక్టులు తక్షణమే పూర్తి చేయాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ**

**ఆత్మకూర్ జూలై 24, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వెనుకబడ్డ జిల్లాగా పేరుపొందిన ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ డిమాండ్ చేశారు. మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో సిపిఐ వనపర్తి జిల్లా మూడవ మహాసభల ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి నెట్టెంపాడు భీమా కోయిల్ సాగర్ తదితర ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయడమే కాకుండా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించి తక్షణమే పూర్తి చేయాలని తద్వారా జిల్లా నుండి వలసలు పూర్తిగా నివారించగలిగిన వారు అవుతారని ఆయన సూచించారు. దేశంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 80 శాతం సంపదను కేవలం మరియు అంబానీ చేతుల్లోకి నెట్టివేస్తున్నారని తద్వారా ఆర్థిక అసమానతలు పెరిగి దేశంలో అంతర్యుద్ధం కొనసాగే ప్రమాదం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు . కేవలం కార్పొరేట్ రంగాలకు కాకుండా దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతన చట్టాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో నానాటికి పెరిగిపోతున్న నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు ఆర్థిక అసమానతలు తొలగించే ప్రధాన భూమిక పోషిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నరసింహ శెట్టి పార్టీ జెండాను ఆవిష్కరించగా సమావేశానికి సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయరాములు అధ్యక్షత వహించగా సిపిఐ నాయకులు రాబర్ట్ శ్రీహరి అబ్రహం భాస్కర్ మోష కుతుబ్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.





ఆత్మకూరులో సిపిఐ మూడవ జిల్లా ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ

## గిరిజన హక్కుల సాధనకై జాతీయ స్థాయి ఉద్యమం

**స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించాలి : ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్**

**బిజినేపల్లి, జూలై 24 ప్రభాతవార్త:** గిరిజన హక్కుల సాధనకై జాతీయ స్థాయి ఉద్యమం చేయాలని ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గోర్ బోలి భాషను అధికారికంగా గుర్తించి, కేంద్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్టీల 10శాతం రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, రిజర్వేషన్ ను 7.5 శాతం నుండి 14 శాతానికి పెంచాలని కోరారు. ప్రభుత్వం తెలంగాణ నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభా బహిర్గతం చేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా జారీ చేసిన ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, మైదాన ప్రాంతంలో గిరిజనులు కోసం ప్రతి జిల్లా కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. నూతనంగా ఏర్పాటైన గిరిజన తండాల గ్రామపంచాయితీలనురెవెన్యూపంచాయితీగా గుర్తించి ప్రత్యేక బడ్జెట్ ను ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీల ల కోసం ఏర్పాటు చేసిన సబ్ ప్లాన్ నిధులను గిరిజనుల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని, పెండింగ్ లో ఉన్న ట్రైకార్ ఋణాలకు తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో గిరిజనులకు జడ్పిటిసి ఎంపీపీ స్థానాల రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఢిల్లీలో త్వరలో ఎల్ హెచ్ పి ఎస్ గౌరవాధ్యక్షులు దాసు రామ్ నాయక్ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద జాతీయ స్థాయి ఉద్యమం చేపట్టనున్నట్లు వివరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్, శివ ఆనంద్ బిచ్చయ్య, హన్మ్య నాయక్, శ్రీనుబాబు, అమర్ బధ్యా, నరసింహ, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ



టౌన్ పోలీస్ స్టేషన్ ముందు ఎస్పీ శ్రీనివాసరావు, సిఐ, ఎస్ ఐలు

**గద్వాలటౌన్ జూలై 24, ప్రభాతవార్త:** గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు గురువారం ఆకస్మికగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీ టీవీ కెమెరాల పనితీరుని పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రికార్డ్‌లను మరియు సిబ్బంది నిర్వహిస్తున్న విదులను పరిశీలించారు. వారు ఏఏవిధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. ముఖ్యంగా రాత్రిపూట పోలీస్‌విధులను పటిష్టం చేయాలని, పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్, బీట్ డ్యూటీలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారునితో సిబ్బంది గౌరవంగా మెలగాలని, వచ్చినా ఫిర్యాదుపై తక్షణమే విచారణ చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్సైకి సూచించారు. పోలీస్ స్టేషన్‌లలో పరిశుభ్రత మరియు 5ఎస్ (5ఎస్) సూత్రాలను పాటించాల్సిన ఆవశ్యకతను చెప్పి, స్టేషన్ ఆవరణంలో మొక్కలనునాటి పచ్చదనం పెంచాలని సూచించారు. ఎస్పి వెంట, గద్వాల్ సీఐటి. శ్రీనివాస్, టౌన్ ఎస్సై కళ్యాణ్ ఉన్నారు.

## ధర్నాను విజయవంతం చేయండి

**భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు**

**ఖిల్లాగణపురం జూలై24, ప్రభాతవార్త:** ఈనెల 31న అన్ని జిల్లా కేంద్రాలను నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు అన్నారు. గురువారం మండల పరిధిలోని మానాజీపేట గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసిమాట్లాడారు కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్‌తో పాటు సకాలంలో వేతనాలు చెల్లించుటకై అదేవిధంగా పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని, ఈనెల31నటియు సిఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నామని ఈధర్నా కార్యక్రమానికి అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అమ్మవారిని దర్శించిన మాజీ మంత్రి

**మానవపాడు, జూలై24 ప్రభాతవార్త:** టిఆర్ఎస్‌నేత మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అలంపూర్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆల య అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండి ప్రజలు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. వీరి వెంట బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్ బాదావత్ సంతోష్ మాతృమూర్తి శాంతమ్మ అంత్యక్రియలు పూర్తి

**- అంత్యక్రియల్లో పాల్గొన్న రాష్ట్ర ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్ కుమార్**

**- జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 24 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాతృమూర్తి శాంతమ్మ అంత్యక్రియలు వారి సంప్రదాయ పద్ధతిలో గురువారం సాయంత్రంస్వగ్రామమైన జనగామ జిల్లాసూరారంలో నిర్వహించారు. ఈసందర్భంగా శాంతమ్మ పార్థివదేహాన్ని కలెక్టర్ సంతోష్ సొంత నివాసం నుంచి అంతిమయాత్రగా నిర్వహించి వారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలను నిర్వహించారు. రాష్ట్ర ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య, నాగర్‌కర్నూల్‌జిల్లా అధికారులు స్వరాజ్యలక్ష్మి, రమేష్ కుమార్, రామ్‌లాల్, రాజేశ్వరి, మురళి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఆర్డీవోలు, తహశీల్దార్లు, పలువురు అధికారులు, జిల్లా కలెక్టర్ వ్యక్తిగత సిబ్బంది, సీసీలు ఖాజామైనుద్దీన్, గౌతమ్, కుటుంబ సభ్యులు తరలివచ్చి బాదావత్ శాంతమ్మకు నివాళులర్పించారు. సంప్రదాయ ప్రకారం శాంతమ్మకు ఆమె చిన్న కుమారుడైన బాదావత్ గోవర్ధన్ చేతుల మీదుగా అంత్యక్రియలు పూర్తి చేశారు.

# రచయిత్రి పోల్కంపల్లి శాంతాదేవికి ఘన సన్మానం

## తెలంగాణ ప్రాంతం గర్వించదగ్గ రచయిత్రి శాంతాదేవి : జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



రచయిత్రి పోల్కంపల్లి శాంతాదేవిని సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ

**వనపర్తి, జూలై 24 ప్రభాతవార్త :** ప్రముఖ కథ,నవల రచయిత్రి పోల్కంపల్లి శాంతాదేవిని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ వనపర్తి జిల్లా కేంద్రంలోని శాంతాదేవి స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నుండి కథ నవల రంగంలో ప్రతిభా పురస్కారం అందుకున్న వనపర్తి చెందిన శాంతాదేవిని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్, గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గత అరవై ఏళ్లకు పైగా కథ నవల రచయిత్రిగా ఆమె పాఠక లోకాన్ని తమరచనలతో అలరించారని ఎస్పీ అన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పోల్కంపల్లి శాంతాదేవి పేరు పొందినరచయిత్రిగా వెలుగొందారని,ఆమె నవలలు సినిమాలుగా,టీవీ సీరియల్స్ గా వచ్చాయని,ఆమె రచనలపై వివిధ విశ్వ విద్యాలయాలలో పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టాలను కూడా అందుకున్నారని ఎస్పీగుర్తు చేశారు.దాదాపు ఎనభై దాకనవలలు,వందకు పైగా కథలు రాసిన పోల్కంపల్లి శాంతాదేవి తెలంగాణ ప్రాంతం గర్వించదగ్గ రచయిత్రి అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిఎస్పీ, సుబ్బరాజు. న్యాయవాదులు, శ్రీరామ్‌రావ్, మన్మోహన్ రావ్, రఘువంశి రావ్, అశోక్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి జయంతి ఉత్సవాలు



సూగూర్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న తొగుట వీర క్షత్రియులు

**పెబ్బేరు, జూలై 24 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలో ఆషాడం అమావాస్య శ్రీ శ్రీశ్రీ చౌడేశ్వరి దేవి జన్మదినం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆషాడం అమావాస్య రోజు శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి జన్మ దిన సందర్భంగా పెబ్బేరు పట్టణం పిజెపి క్యాంప్ దగ్గర వెలసిన శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి, సుగురు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఉదయంఅమ్మవారికి అభిషేకం,అలంకరణ, కుంకుమార్చన, బోనం అలంకరణ, పల్లకి సేవ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు ఇవ్వడం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం నుండి కుంకుమ కంకణాలు చౌడేశ్వరి దేవి ఆలయం దగ్గర భక్తులకు ఇవ్వడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలో మహిళలు పాల్గొని విజయవంతం చేశారు.సాయంత్రం అమ్మవారి ఊరేగింపులో భాగంగా భజన మహిళల కోలాటం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన భక్తాదులకు తోగుట వీర క్షత్రియ సంఘం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సుగురు గ్రామ క్షత్రియ సంఘం పెబ్బేరు బిజెపి క్యాంప్ చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**ఇటిక్యాల, జూలై 24 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు విద్యారంగంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణ పరిష్కారంగావాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించుకునేందుకుగాను ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రాలలోని తాహసిల్దార్లకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు వినతి పత్రాలు సమర్పించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట పిలుపుమేరకు ఇటిక్యాల మండల కేంద్రంలో గురువారం డిప్యూటీ తహసిల్దార్ నందిని కి. ఎర్రవల్లి మండల కేంద్రంలో తహసిల్దార్ నరేష్, గద్వాల పట్టణంలోని డిప్యూటీ తాహసిల్దార్ అజిత్ కుమార్‌కు ఉపాధ్యాయు సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన మెమోరండలను సమర్పించారు. ఈ సందర్భంగా విద్యా, ఉపాధ్యాయ రంగంలో ఏళ్ల తరబడిగా ఉన్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని,ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు వెంటనే నిర్వహించాలని 317 జీవీ ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు పంపాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని తదితర 30 డిమాండ్లతో కూడినవినతి పత్రాన్నితహసిల్దార్‌లకుఉపాధ్యాయ సంఘాల నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ప్రభాకర శాస్త్రి, గోపాల్, ఉదయ్ కిరణ్, రాజశేఖర్, తిమ్మప్ప, రవికుమార్, ప్రకాష్, మాధవన్, ప్రభుదాసు, రాంబాబు, కర్నాకర్,రాఘవులు, మద్దిలేటి ఆర్థర్,విజయ్ కుమార్, బీసన్న, దయాకర్, వెంకోజీ, బలరాముడు, బాలకృష్ణ, సురేష్ కుమార్, బీచుపల్లి, లింగారెడ్డి,బీసన్న, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు..

## షాబాద్ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలి



షాబాద్ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని వినతి పత్రం ఇస్తున్న గ్రామ యువత

**ఇటిక్యాల, జూలై 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో వందమంది విద్యార్థులకు పైగా చదువుకుంటున్నారని పాఠశాలలో 6,7 తరగతుల విద్యార్థులకు బోధించుటకు టీచర్ల కొరత ఉందని అలాగే సబ్జెక్టుల వారిగా టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు చదువులో వెనుకబడి పోతున్నారని గురువారం గ్రామానికి చెందిన యువత పాఠశాలకు కొరత ఉన్న ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈఓ వెంకటేశ్వర్లకు వినతి పత్రం ఇచ్చారు. అంతేకాక ఈ పాఠశాలలో పనిచేస్తున్న హిందీ టీచర్ అరుంధతిని గత ఏడాదిలో గద్వాల మండలంలోని శెట్టి ఆత్మూరు పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపడం జరిగిందని తిరిగి షాబాద్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు డిప్యూటేషన్ పై వెళ్లిన హిందీ బోధించే టీచర్‌ను తిరిగి పాఠశాలకు పంపి విద్యార్థులకు విద్యాబోధన అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్లకు వినతిపత్రంలో వారు వివరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి

**ఉప్పునుంతల, జూలై24 ప్రభాతవార్త:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని వికలాంగుల సాధన కమిటీ ప్రతినిధులు తహసీల్దార్, ఎంపిడిఓలకు వినతి పత్రం అందజేశారు. వికలాంగులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఛత్తీస్ ఘడ్, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాల్లో నిర్వహించిన విధంగా తెలంగాణ రాష్ట్రంలో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని వారు వారి డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. మండల పరిషత్తు, జిల్లా పరిషత్, నామినేటెడ్ పోస్టుల భర్తీలో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని, పాలన వ్యవస్థలో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించడంద్వారా వికలాంగుల అభివృద్ధికి అసోరమైన సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు అవుతాయని పేర్కొన్నారు. వికలాంగులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతినిధ్యం పొందుతే రాజీవ్ వికాసం, ఇందిరమ్మ ఇల్లు, వికలాంగుల పెన్షన్లు తదితర పథకాల కోటాలో పూర్తిస్థాయిలో వికలాంగులకు అమలు అవుతాయని, వికలాంగులు ప్రత్యక్ష పాలన వ్యవస్థలో భాగస్వాములు కావడం వల్ల తమ హక్కులు తమకు అందుతాయని వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వికలాంగులకు స్థానిక సంస్థలు ప్రాతినిధ్యం పొందేలా కృషి చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా వికలాంగుల కన్వీనర్ రాజశేఖర్, మండల పాతుకుల నీరంజన్, మండల కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్, దివ్యాంగ నాయకులు లింగంగౌడ్, శ్రీను, గెలవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి




తహసీల్దార్ వరలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

**వీపనగండ్ల జులై24, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు.ఎస్.పి.సి)పిలుపు మేరకు ఉపాధ్యాయ ఉద్యోగ,విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం నాడు వీపనగండ్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వరలక్ష్మి టీఎస్‌యుటిఎఫ్ వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. యూటీఫ్ మండల అధ్యక్షులు బడికల రామచంద్రయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించి,పిఆర్సి ని అమలు చేయాలని అన్నారు. అన్ని రకాల క్యాడర్ల బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ ను వెంటనే ప్రకటించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతనం అమలు చేసి, కాంట్రాక్ట్ టీచర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. పాఠశాల అవసరాలకు డిప్టేషన్లు కాకుండా పైరవీ డిప్యూటేషలను వెంటనే రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కురుమూర్తి, బాలీశ్వరయ్య లోకయ్య ,నాయకులు రామకృష్ణ, అనిత మురళి,మురళి నాయక్, రంజిత్ కుమార్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మీ సలహాలు అవసరం లేదు..

- దశలవారీగా అభివృద్ధి పనులు
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు

### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ హితవు




మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై24 ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలోని 14అసెంబ్లీ నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు.మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.తన హయాంలో మినీ ట్యాంక్‌బండ్ పనులు, అండర్ డ్రైనేజీ కోసంరూ.250 కోట్లు తెచ్చిన, మన్యంకొండ వద్ద రోప్‌వే కోసం టెండర్లు అయ్యాయని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో జేఎన్‌టీయూవచ్చిందని హడావిడి చేశారని, మరి ఆ జీవో ఎక్కడుందని ప్రశ్నించారు.ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో పీయూకు లా, ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరు అయ్యాయని, యూనివర్సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు తీసుకురావడం జరిగిందన్నారు. మాజీ మంత్రి హయాంలో కేవలం శిలాఫలాలకే పరిమితమయ్యారని, కాని కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు.మాజీ మంత్రి సలహాలు, సూచనలు మా ప్రభుత్వానికి అవసరం లేదన్నారు. మరో సీనియర్ నాయకుడు ఎన్‌పీ.వెంకటేశ్ మాట్లాడుతూ బీసీల గురించి మాట్లాడే అర్హత మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు లేదని విమర్శించారు. వైఎస్‌ఆర్ హయాంలో 34 శాతం బీసీ రిజర్వేషన్లు ఉంటే కేసీఆర్ వచ్చిన తర్వాత 23 శాతం చేసినప్పుడు మీరు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టి 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. మాజీ మంత్రి మాటలకు ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయకత్వంలో కార్పొరేషన్‌లోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల దృష్టిలో పెట్టుకొని మాజీ మంత్రి రాజకీయ లబ్ధికోసం కోసం మాట్లాడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు అజ్మత్‌అలీ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టప్రకారం నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలి

- నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి, జూలై 24 ప్రభాతవార్త:** జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లా పోలీస్ అధికారులతో గురువారం రోజు నెలవారి నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్లో ఉన్న గ్రేవ్, నాన్‌కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు.పెండింగ్ కేసులను న్యాయ అధికారులు, డాక్టర్స్‌తో సమన్వయం కలిగి ఉండి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల సమగ్ర విచారణ ద్వార నిందితులకు శిక్ష పడేవిధంగా చేసి బాధితులకు న్యాయం చేకూరేలా అధికారులు అందరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్ కువచ్చే పిర్యాధుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యాదులను పెండింగ్‌లోఉంచారాధని సూచించారు. జిల్లా పరిధిలో మిస్సింగ్‌కేసులను వెంటనే పట్టుకోవాలని అన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్నకేసులను త్వరగా డిస్పోజల్ చేయాలి అన్నారు ఫోక్సో,ఎస్సీ ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. నేరాలు జరిగే ప్రదేశాలు,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రదేశాలు హాట్‌స్పాట్‌గా గుర్తించి పాయింట్ బుక్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ బుక్ నుతనిఖీ చేసేటట్లు చూసుకోవాలని సూచించారు.పాత నైరస్తులు, రౌడీలు, సస్పెక్ట్‌ల కదలికల పై నిఘా ఏర్పాటుచేసి వారిని ప్రతి రోజు తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. అక్రమ గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, గుట్కాలు, ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ దందాల పై నిఘా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో బాగంగా పట్టణాలలో, గ్రామాలలో సీసీ కెమెరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి సీసీ కెమెరాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకునేల చూడాలని తెలిపారు. సామాజిక అంశాలపై, సైబర్ నేరాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రాబోయే లోకల్ ఎలక్షన్స్,గణేష్ ఉత్సవాలకు సంబంధించి ముందస్తు సంసిద్ధంగా ఉండాలని ప్రజలతో మమేకం అవుతూ గ్రామాలలో సమస్యలు తెలుసుకొని, సమాచారని సేకరించాలని తెలిపారు. అలాగే మత ఘర్షణలకు సంబంధించి పాత నేరస్తుల పై నిఘా ఉంచి తనిఖీ నిర్వహించాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేయాలి అని ఎస్పీ తెలిపారు.

**ముసురు వర్షాల నుండి ప్రజలు అప్రమతంగా ఉండాలి:** ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నుండి ప్రజలు జాగ్రత్తగా ఉండాలి అని, మిద్దె ఇండ్లు, లోతట్టు ప్రాంతాలలో ఉండారాదని తెలిపారు. పోలీసు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండి అత్యవసర సమయంలో డయల్ 100 కాల్స్ వస్తె తక్షణమే స్పందించాలని తెలిపారు. అలాగే పిల్లలు నదులు, కుంటలు, చెరువులు, వాగుల వద్దకు చేపలుపట్టడానికి,ఈత కొట్టడానికి, సెల్ఫీఫోటోలు తీసుకోవడానికి వెళ్లరాదని కోరారు. ఈ సమావేశంలో డీఎస్పీలు ఎన్ లింగయ్య, మహేష్, సిఐలు శివ శంకర్, రామ్ లాల్, రాజేందర్ రెడ్డి,సైదులుఎస్ఐలువెంకటేశ్వర్లు,రాముడు,రాజు, భాగ్యలక్ష్మిరెడ్డి, నవీద్,రాము, రమేష్, విజయ్, రాజా శేఖర్, సునిత, పిఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

### స్టేట్ మార్కెటింగ్ డైరెక్టర్ వైడీ పద్మహర్ష

**బిజినేపల్లి, జూలై 24 ప్రభాతవార్త:** ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తూ కొందరు దళారులు రైతులను మోసం చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ వైడి పద్మ హర్ష తెలిపారు. మోతాదుకుమించి ఎరువులువాడరాదని రైతన్నలకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఎరువుల పంపిణీ ఏవిధంగా జరుగుతుందో ఎకరాకుఎన్ని బస్తాలు ఇస్తున్నారో రైతులను అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ గోదాంలోని ఎరువుల నిల్వలను సంపూర్ణంగా పరిశీలించి పంపిణీ విధానాన్ని సూక్ష్మంగా గమనించారు. మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌రైతులకు ఎప్పటికప్పుడు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కొద్దిమంది దళారుల మాటలు విని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.భూసార పరీక్షలుచేయించి లోపించిన ఎరువులను మాత్రమే పంటకు అందించాలని సూచించారు. తద్వారా అనవసర ఖర్చులను తగ్గించుకోవడం వల్ల పెట్టుబడి మిగిలివచ్చాన్నారు. అలాగే ఎరువులు తీసుకునే రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు నమోదు చేసి సాగు విస్తీర్ణం మేరకే ఎరువులు ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు.రైతులకు అవసరమైన ఎరువులు నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పూర్ణచంద్రారెడ్డి, ఏవో కమల్ కుమార్, సీఈవో రవీందర్, ఏఈవో మధు తదితరులు ఉన్నారు.

## టిబి పరీక్షలు అందరూ చేసుకోవాలి

**నారాయణపేట, జూలై24 ప్రభాతవార్త:** నారాయణపేట మండల పరిధిలోని తిరుమలపురం గ్రామంలోగురువారం రోజు టిబి క్షయ లాంటి వ్యాధులకు గ్రామంలో మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని డా. చందన, డా.విరోజా అన్నారు. ప్రజలు వారి ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఎవరికి ఎలాంటి అనుమానాలు ఉన్న ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రానికి వచ్చి డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉంటారు. కాబట్టి వారి దగ్గర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు ప్రజలందరూ వారు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ క్యాంపులు ఏర్పాటుచేసిన దాంట్లో వాళ్ళ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. వారికి కావాల్సిన మందులు పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ ప్రసాద్,ల్యాబ్ టెక్నీషియన్ దశరథ్ ప్రసాదు, సరస్వతి, ఏఎన్ఎం ముస్కాన్ బేగం, అనురాధ, ఆశా వర్కర్స్ కల్పనా, వెంకటేశ్వరి, నర్సమ్మ, కృష్ణవేణి, జయ, రేణుక, మంజుల పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం

**నారాయణపేట టౌన్, జూలై 24 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణానికి సమీపంలో వెలసిన మెట్టుగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి దర్శనం కోసం అమావాస్య, పౌర్ణమి రోజు భక్తులు తండోపదండాలుగా తరలివస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు తదితరులు ఉన్నారు.

**మద్దూర్, జూలై 24 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలోని కాచువాకు శివాలయం దగ్గర అమావాస్య సందర్భంగా శ్రావణమాసం మొదటి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ప్రతి అమావాస్యకు ఈ శివాలయం దగ్గర అన్నదానం చేయడం విశేషం. అమావాస్య రోజు ఇక్కడ శివుని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు లభిస్తాయని పూర్వీకుల నమ్మకం.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు శివ కుమార్, చెన్నప్ప, బర్ల చంద్రశేఖర్, కుమ్మరి నరసింహ, బర్ల శ్రీశైలం, యాదవ రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిన్ననాటి మిత్రునికి ఆర్థిక సాయం



చిన్ననాటి మిత్రునికి ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

**వీపనగండ్ల జూలై 24, ప్రభాతవార్త:** మండలంలోని పుల్గర్ జర్ల గ్రామానికి చెందిన సాయిబాబా అనేమిత్రుని తండ్రి అనారోగ్యం కారణంగా మృతి చెందడం జరిగింది.అయితే గురువారం నాడు తోటి మిత్రులు రఘు డి వెంకటేశ్వర్లు సూర్యనారాయణ అల్లే వెంకటేశు తదితర మిత్రులు అందరూ కలిసి వాళ్ల ఆర్థిక పరిస్థితి బాగాలేనికారణంగా35216 రూపాయలు సాయిబాబాకు అందజేయడం జరిగింది అనివారు తెలిపారు. అయితే చిన్నప్పటి నుండి ఒకటే బ్యాచ్‌లో క్లాస్మేట్స్‌గా చదువుకోవడం జరిగిందని ఎవరైనా మిత్రులుఈ రకమైనటువంటి ఆర్థిక పరిస్థితులకు ఇబ్బందులుఎదుర్కొంటుంటే వారికి కొద్దిగా సహాయం చేయడానికి మా మిత్ర బృందం తోడ్పాటును అందిస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## ఖర్గేను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి



ఖర్గేను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, జులై24 ప్రభాతవార్త :** బీసీ రిజర్వేషన్ల సాధనలో భాగంగా ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రితో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి ఢిల్లీ ప్రయాణం అయ్యారు. ఇప్పటికే 42శాతం కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుని, ఆర్డినెన్స్ సైతం జారీ చేయగా ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది.కావున బీసీ రిజర్వేషన్లపై కేంద్రం మీదఒత్తిడి తీసుకువచ్చి 42శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు మంత్రి వాకిటిశ్రీహరి సహచర మంత్రులతో ఢిల్లీ వెళ్లారు.ఢిల్లీలో లోకసభలోప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసిసి జాతీయ అధ్యక్షుడు,రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేలను మంత్రులు కలిశారు. ఖర్గే నివాసంలో కీలక సమావేశం నిర్వహించి పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల అంశం లేవనేత్తడంతో పాటు,9వ షెడ్యూల్‌లో చేర్చా లని కోరాలని విన్నవించారు. బీసీ వ్యక్తికి పీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌ది అని, ఇతర పార్టీలు బీఆర్ఎస్, బీజేపీలు బీసీలకు అధ్యక్షపదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిం చారు.బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్రం తేల్చకపోతే రాష్ట్రంలో ఆ పార్టీకి మనుగడ ఉండదని హెచ్చరించారు. ఢిల్లీ బాట పట్టిన వారిలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

## ఆర్‌బిఐ వారి సౌజన్యంతో జన్ సురక్ష క్యాంప్

**నారాయణపేట,జూలై 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని శాసనపల్లి గ్రామంలో ఎస్బిఐ కౌన్సిలర్లు అనసూయ, వెంకటేష్ నారాయణపేట బ్యాంక్ మేనేజర్ తో కలిసి జన్ సురక్ష క్యాంపును నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ లాంటి స్కీములను ప్రతి ఒక్కరూ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట బ్యాంక్ మేనేజర్, కౌన్సిలర్లు అనసూయ, వెంకటేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జూనియర్ లెక్చరర్ల కోసం దరఖాస్తులు

**చిన్న చింతకుంట, జూలై 24 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల కళాశాలలో జూనియర్ లెక్చరర్ల నియామకానికై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ఎస్ఓ హేమలత గురువారంఒక ప్రకటనలో తెలిపారు.జూనియర్ కళాశాలలో రెండు జూనియర్ లెక్చరర్ల పోస్టు ఖాళీ ఉన్నాయని వాటిలో వృక్షశాస్త్రం ,రసాయన శాస్త్రం సబ్జెక్టులను బోధించుటకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆమె తెలిపారు. పోస్ట్‌గ్రాడ్యుయేట్లు 50% ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఆసక్తిఉన్నవారు శనివారం సాయంత్రంమండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలోదరఖాస్తు పత్రాలు అందజేయాలని ఆమె కోరారు.

## బెస్ట్ అవైలెబుల్ స్కూల్‌లో అడ్మిషన్‌ల ఆహ్వానం

**నారాయణపేట ప్రతినిధి, జూలై24 ప్రభాతవార్త:** జిల్లాలోని 2025-26సం.గాను జిల్లాలోని బెస్ట్ అవైలెబుల్ స్కూల్స్‌లలో మిగిలి పోయిన సీట్ల భర్తీ(అడ్మిషన్) కొరకు అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిఅధికారి కజ్జం ఉమాపతి ఒక ప్రకటనలో తెలిపారు. ధరఖాస్తు ఈ నెల 31 వరకు గడువు ఉన్నట్లు గడువులోపు ధరఖాస్తు చేసుకోవాలనితెలిపారు.1వ (ఒకటవ)తరగతిలో బాలురకు (09)బాలికలకు (03) మరియు5వ (అయిదవ) తరగతిలో బాలురకు(13)బాలికలకు(07)సీట్లు మిగినట్లు ఇంతకు పూర్వం కుటుంబంలో బెస్ట్ అవైలెబుల్ స్కూల్ అడ్మిషన్ పొందిన కుటుంబంలోని వారు ఉంటె అట్టి వారు అనర్హులని దరఖాస్తు దారు యొక్క కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాలవారికి రూ.1.50 లక్షలు పట్టణ ప్రాంతాల వారికి రెండు (02) లక్షలు మించరాదని 1వ, తరగతిలో చేరగోరు వారి పుట్టిన తేది 1.6.2019 నుండి 31.5.2020లోపు జన్మించిన వారు మాత్రమే అర్హులని, మీసేవ ద్వారా పొందిన భర్త్ సర్టిఫికేట్, కులం ఆదాయం, తదితర ధృవ పత్రాలు కలిగి ఉండి తప్పనిసరిగా దరఖాస్తుకు జతపర్చాలని ఆయన తెలిపారు.

## వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**పెబ్బేరు, జూలై24 ప్రభాతవార్త:** పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని హాజరు రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్లు, ఇన్ పేషెంట్ రిజిస్టర్,క్యాలెండర్ తనిఖీ చేసినారు.అలాగే ఓపి వార్డులో పాము కాటు పేషెంట్‌ను పరిశీలించారు. అనంతరం డెలివరీ రూములో ప్రసవమైనబాలింతను, శిశువు ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని కొత్తగా నిర్మిస్తున్న బిల్డింగును పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొనిసరైన వైద్యము అందించాలనిఅక్కడున్న సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. ప్రవళిక, పల్లె దవాఖాన డా.సుధారాణి, హెల్త్ సూపర్వైజర్ లీలమ్మ, స్వరూపరాణి,హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, ఫార్మసిస్ట్ కుమారి, స్టాఫ్ నర్సింగ్ కృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ విక్టర్ రాజు, ఏఎన్ఎంలు వెంకటమ్మ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి

**కల్వకుర్తి, జూలై 24 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండల భారతీయ జనతాపార్టీ సంస్థగత ఎన్నికల కార్యాశాల సమావేశాన్ని గురువారం స్థానిక పద్మశాలి ఫంక్షన్ హాల్ లో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మట్ట నరేష్‌గౌడ్ అధ్య క్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి హాజరై మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు జరిగిన కార్యకర్తలు,నాయకులు పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, ప్రభుత్వంపై తిరగబడడానికి ప్రజల సిద్ధంగా ఉన్నరాన్నారు.కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి ఎన్నికలలో గెలుస్తామని అన్నారు.ఈ సమావేశానికి బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, బండెల రామచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సిరెడ్డి, జిల్లా కాన్సిల్ సభ్యులు కిష్టారెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ శ్యాంసుందర్, నాయకులు సురేందర్‌గౌడ్, కృష్ణారెడ్డి,శ్రీశైలం, శ్రీనివాసులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాతృమూర్తి శాంతమ్మ అంత్యక్రియలు పూర్తి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై24 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాతృమూర్తి శాంతమ్మ అంత్యక్రియలు వారి సంప్రదాయ పద్దతిలో గురువారం సాయంత్రం స్వగ్రామమైన జనగామ జిల్లా సూరారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతమ్మ పార్థివదేహాన్ని కలెక్టర్ సంతోష్ సొంత నివాసం నుంచి అంతిమయాత్రగా నిర్వహించి వారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలను నిర్వహించారు.రాష్ట్ర ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషాషేక్, మాజీ ఉపముఖ్యమంత్రిరాజయ్య,నాగర్‌కర్నూల్ జిల్లా అధికారులు స్వరాజ్యలక్ష్మి, రమేష్‌కుమార్,రామ్‌లాల్, రాజేశ్వరి, మురళి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఆర్డీవోలు, తహశీల్దార్లు, పలువురు అధికారులు, జిల్లాకలెక్టర్ వ్యక్తిగత సిబ్బంది, సీసీలు ఖాజామై నుద్దీన్,గౌతమ్, కుటుంబసభ్యులు తరలివచ్చి బాదావత్ శాంతమ్మకు నివాళులర్పించారు. సంప్రదాయ ప్రకారం శాంతమ్మకు ఆమె చిన్నకుమారుడైన బాదావత్ గోవర్ధన్ చేతుల మీదుగా అంత్య క్రియలు పూర్తి చేశారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన స్పెషల్ టీం

**భూత్పూర్,జూలై 24,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక అధికారుల బృందం గురువారం జిల్లాలోని వివిధ మండలాలల్లోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ పద్మహర్ష,జిల్లా మార్కెటింగ్ అధికారి బాలామణి,జిల్లా వ్యవసాయాధికారి బువ్వల వెంకటేష్‌ల బృందం బాలానగర్, రాజాపూర్,జడ్చర్ల,భూత్పూర్ మండలాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు. ఎరువుల స్టాక్ రిజిష్టర్లు,స్టాక్ ఇస్యూయింగ్ రిజిష్టర్లను వారు పరిశీలించారు.యూరియా అమ్మకాలపై ఈ టీం ప్రత్యేక దృష్టిని సారించారు.ఇందులో భాగంగా భూత్పూర్ మండల కేంద్రంలోని పీఏసీఎస్,అన్నదాత ఫర్టిలైజర్స్ ,హాకా ఫార్మర్ సర్వీస్ స్టేషన్,ఆగ్రో రైతు సేవాకేంద్రాలలో ఎరువుల స్టాక్ బోర్డ్ వివరాలు,స్టాక్ రిజిష్టర్ల వివరాలు,ఈపాస్‌లోని బాలెన్స్ వివరాలు,రైతువారీగా అమ్మకాల వివరాలను తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి బువ్వల వెంకటేష్ మాట్లాడుతూ భూత్పూర్ మండలానికి 294టన్నులయూరియా సదరు దుకాణాలకు వచ్చిందని, మండలంలో ఎలాంటి యూరియా కొరత లేదని అధికారులకు స్పష్టంచేశారు.రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల ఆధారంగా యూరియాను సరఫరా చేయాలని డీలర్లకు సూచించారు.ఈ టీంతో పాటు మండల వ్యవసాయా ధికారి మురళిధర్ ఉన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

**నారాయణపేట, జూలై24 ప్రభాతవార్త:** విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. గురువారం నారాయణపేట జిల్లా చిన్నజట్రం ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు రిజిస్టర్ తదితర అంశాలపై తనిఖీ నిర్వహించారు. అనంతరం డిఎంహెచ్వో కార్యాలయాన్ని తనిఖీ చేసి హాజరు రిజిస్టర్ పరిశీలించారు. జిల్లాలో వైద్య సేవలు నిరుపేదలకు అందేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. డిఎంహెచ్వో జిల్లాలోసిబ్బంది వివరాలు తెలియజేశారు.అనంతరం నారాయణపేట మున్సిపల్ పరిధిలోని వార్డ్ నెంబరు 6లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల బేస్ మెంట్ లెవెల్ పనులను జిల్లా కలెక్టర్ తనిఖీ నిర్వహించి నాణ్యతగా ఇంటి నిర్మాణం చేపట్టాలనిఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.


నాయకుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న బిఆర్ఎస్ నాయకులు






# ఘనంగా కేటీఆర్ జన్మదినోత్సవం

◆ రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు,కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేసిన బిఆర్ఎస్ నాయకులు

**జడ్చర్ల, జూలై24 ప్రభాతవార్త:** భవిష్యత్‌లో ఉన్నత పదవులు చేపట్టి తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. కెసిఆర్ హరితహారం స్పూర్తితోమొక్కలు నాటిశుభాకాంక్షలు తెలియజేసారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జడ్చర్ల నియోజకవర్గ క్యాడర్ వివిధ కార్యక్రమాల ద్వారాయువనేత కేటీఆర్‌కు బర్త్ డేవిషెష్ తెలియజేసారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బిఆర్ఎస్ నాయకులు, కేటీఆర్ అభిమానులు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నారాయణపేట ప్రతినిధి, జూలై24 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని మరికల్ మండలం తిరుమల ఫంక్షన్ హాల్లో జరిగిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షులు యస్.రాజేందర్ రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిజేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, సీనియర్‌నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**మానవపాడు, జూలై 24 ప్రభాతవార్త :** బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు భవిష్యత్తు తెలంగాణ రాష్ట్రానికి నాయకుడు ముఖ్యమంత్రి అని ఎమ్మెల్యే విజయుడు కొనియాడారు. గురువారం కేటీఆర్ జన్మదిన వేడుకలు అలంపూర్ చౌరస్తాలోని బిఆర్ఎస్ నేత కిషోర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు చెన్నుపాడు దుబ్బన్న, ఆనంద్, డేవిడ్, బీసన్న,రవి, పురుషోత్తం విజయ్, తదితరులు పాల్గొన్నారు.

**గద్వాల టౌన్‌లో:** కేటీఆర్ జన్మదిన వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్రరెడ్డి, మోనేష్, రాజారెడ్డి,గంజిపేటరాజు,పటేల్ జనార్దన్‌రెడ్డి, మాజీఎంపిటిసి బీచుపల్లి, అంగడి బసవరాజ్,వెంకటేశ్వర రెడ్డి,వెంకటేష్ నాయుడు, సోమశేఖర్‌రెడ్డి, ఎస్.రాము నాయుడు, చక్రిధర్‌రెడ్డి,పచర్ల శ్రీనివాసులు,కురవపల్లయ్య, జాంపల్లిభరత్ సింహారెడ్డి, రామకృష్ణ ముదిరాజు,శ్రీ రాములు,బాసు గోపాల్,మహదేవప్ప,వీరేష్ గౌడ్, ఎండి.మాజ్, ముని మోర్య,కంగారు తిమ్మప్ప,నక్కరవి,అనిల్, లోకేష్, నరసింహులు,రాజు,రవి పాల్గొన్నారు.

**బిజినేపల్లిలో:** బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పులేందర్‌రెడ్డి,మాజీఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, చిన్నారెడ్డి శేఖర్ రావు మహేశ్వర్ రెడ్డిబాలస్వామి పర్వతాలు లక్ష్మయ్య వంశీ నాయక్ మహేశ్వరరావు గఫూర్ శివఅశోక్ గోపాల్‌రెడ్డి కృష్ణయ్యమంగిమురళి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**నవాబుపేటలో:**మండల పార్టీ అధ్యక్షులు మడేమోని నర్సిములు, మాజీ జడ్పీటీసీ ముత్యాల రవీందర్‌రెడ్డి, మాజీ యంపిపి కర్రోళ్ల శ్రీని వాస్,పార్టీ ప్రధాన కార్యదర్శి కరణం ప్రతాప్, మాజీ కోఫ్షన్ తాహేర్, పార్టీ యువత అధ్యక్షులు మెండే శ్రీను, మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, హన్మంతు, అబ్దుల్లా, యాదయ్య, నవనీత్,రాజునాయక్, మల్లేపగా నర్సిములు, జైపాల్‌రెడ్డి, గండు తిరుపతయ్య వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

**కోయిలకొండలో:** మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి. కృష్ణ,మండల తాజామాజీ జెడ్పిటిసి సభ్యుడువిజయ భాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మోదీపూర్ రవి, వెన్నచేడు శ్రీనివాస్‌రెడ్డి, భీమ్ రెడ్డి, నారాయణరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, డి.నారాయణగౌడ్,మాజీ సర్పంచ్ జి.రాజ్ కుమార్, కుమ్మరి రాజు, మాజీ కోఆప్షన్ సభ్యులు టీవీఖాజా, ఆరెరమేష్, పులి నరసింహులు, పానుగంటినగేష్, మోహిన్ ఖాన్, జమాల్‌పూర్ శివ, కొత్లాబాద్ మాధవులు, వాసు, ప్రభాకర్ రెడ్డి, మఠంరవి, గుమ్మడి శ్రీనివాసులు, ఫోటోగ్రాఫర్ నరేష్, నజిముద్దీన్, రాఘవేందర్, రామునాయక్ పాల్గొన్నారు.

**రాజాపూర్‌లో:** పార్టీ మండల అధ్యక్షులు మేకల శ్రీశైలం యాదవ్,ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, పార్టీనాయకులు, కార్యకర్తలు, కేటీఆర్ జన్మదిన వేడుకలో పాల్గొన్నారు.

**అమరచింతలో:** టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అక్కల నరసింహులు గౌడ్, మాజీ జెడ్పిసి, హెచ్ బి. రాజేందర్ సింగ్,టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, రమేష్ ముదిరాజ్, ఆత్మకూర్ మార్కెట్ మాజీ చైర్మన్, ఎస్ ఏ,రాజు, ఆత్మకూర్ మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్, టిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు, జింకరవి, డిసి పురుషోత్తం, తెలుగు రమేష్, కలంపాషా, మాజీ కౌన్సిలర్, బిఎస్ రాజకుమార్,మాజీ కోఆప్షన్ సభ్యులు,షాన్వాజ్ ఖాన్, జలంధర్, సలాం కేటీఆర్ జన్మదిన వేడుకలో పాల్గొన్నారు.

**చిన్న చింతకుంటలో:** పార్టీ మండల అధ్యక్షులు కోట రాము, మాజీసర్పంచ్ మోహన్‌గౌడ్, బిఆర్ఎస్ మండల నాయకులు శివశంకర్ గౌడ్, మల్లెల బాలరాజ్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు కురుమూర్తి, రియాజ్, వడ్డేమాన్, అమ్మాపూర్‌గ్రామ అధ్యక్షులు సాయిలు, బలరాం నాయకులు మహమూద్, గుల్లకుంట లక్ష్మణ్,అశోక్, రాకేష్, విష్ణు, మండలనాయకులు,అలయువసేన నాయకులు పాల్గొన్నారు.

**మద్దూర్‌లో:** బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వంచర్ల గోపాల్,మద్దూర్ నరసింహ,బర్ల జగదీశ్వర్, వీరారెడ్డి, జాజిరావుపల్లి శేఖర్ పాల్గొన్నారు.

**ఇటిక్యాలలో:** కొండేరు గ్రామంలో మండల టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుడు శ్రీధర్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ వీరన్న, బషీర్ మియా, వీరుబాబు, శేషు, వెంకటన్న. వెంకటేష్, మధుచారి తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడలో:** బీఆర్ఎస్ పార్టీ ధన్వాడ మండల అధ్యక్షులు ఎం.వెంకట్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు మల్లేష్ గౌడ్,గున్ముకుల మాజీ ఎంపీటీసీ డీ.సుధీర్ కుమార్ రావు, బీసీ సెల్ నాయకులు వడ్ల శాంతి కుమార్,పార్టీ సీనియర్ నాయకులు జుట్ల సత్యానారాయణ గౌడ్,తమ్మలి కృష్ణయ్య, ఎల్.వెంకటయ్య గౌడ్,కే.నర్సింహులు, కుర్వచంద్రప్పా, గున్ముకుల పార్టీ అధ్యక్షుడురమేష్,వడ్ల రాములు,నర్సింహులు, మైనారిటీ నాయకులు నాసర్,మెకానిక్ భాను,తాజుద్దీన్,కుమాల్,జమాల్, యుత్ అధ్యక్షులుకృష్ణ దాస్,ఆటోభాస్కర్, ఇర్ఫాన్, వెంకటేష్,నవీన్,వంశిగౌడ్ కేటీఆర్ జన్మదిన వేడుకలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే పథకాలు

### -భూత్పూర్ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**భూత్పూర్,జూలై 24,ప్రభాతవార్త:**ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ పథ కాలు కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే అమ లౌతున్నాయని, కాంగ్రెసేతర వ్యక్తులు, కార్యకర్తల్ని కాంగ్రెస్ పథకాలకు దూరం పెడుతోందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంక టేశ్వర్‌రెడ్డి విమర్శించారు. తమ బీఆర్ఎస్ పాలన లో పార్టీలకతీతంగా అర్హులైనవారికి పథకాలు అమలు చేశామని అన్నారు. తాము చేసిన పనులు ప్రజలకు చెప్పుకోలేక, కార్య కర్తలు,నాయకుల సమన్వయ లోపం వల్లే గతఎన్నికల్లో తాము ఓటమి పాలయ్యామని ఆల ఆవే దన వ్యక్తం చేశారు. గురువారం భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని తన క్యాంపు కార్యాల యంలో ఏర్పాటైన భూత్పూర్ మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ అధికారం చేపట్టిందని,ఇచ్చిన 420హామీలు,6గ్యారంటీపథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయలేక పోయిం దని విమర్శిం చారు. కాంగ్రెస్ హయాంలో పథకాలన్ని కాంగ్రెస్ కార్యకర్తలకే అమలు చేస్తున్నా రని,ప్రతి ప్రభుత్వ శాఖలో కాంగ్రెస్ కార్యకర్తలు పైతనం చెలాయిస్తున్నారని,తమ పార్టీనాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతూ ఇబ్బంధులకు గురిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆల ఆరోపించారు. భూత్పూర్ పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని,ప్రస్తుత ఎమ్మెల్యే జీఎంఆర్ పోలీసు లకు సెక్షన్లు చెప్పి మరీ తమ నాయకులు,కార్యకర్తలపై కేసులు వేయిస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ పాలనలో ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టలేదని అన్నారు. కేసులకు భయపడేదే లేదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజులు బీఆర్ఎస్‌వేనని మాజీ ఎమ్మెల్యే ఆల జోష్యం చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేస్తూ పార్టీ గెలుపునకు కృషిచేసి భూత్పూర్ మండలంలో గులాబీ జెండా ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు,మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి,మండల రైతు బంధు మాజీ అధ్యక్షుడు మొల్గర నర్సింహులు గౌడ్,జిల్లా మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు మనెమోని సత్యనారాయణ,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తూము శ్రీనివాస్‌రెడ్డి,పార్టీ సీనియర్ నాయకుడు టి మురళీధర్‌గౌడ్,మాజీ ఎంపిపి రాచూరి చంద్రమౌళి,మాజీ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్,పార్టీ మాజీ అధ్యక్షుడు సత్తూర్ నారాయణగౌడ్ ,మైనార్టీ నాయకులు మొహ్మద్ ఆహ్మద్,మొహ్మద్ సాధిక్,గడ్డం ప్రేమ్‌కుమార్,బోల వెంకట్రా ములు,బోల శేఖర్,కృష్ణయ్యగౌడ్ తదితరులు ప్రసంగించారు. పార్టీ నాయకులు మందడిసరోజ్‌రెడ్డి, మేకల సత్యనారాయణ, ఆల శ్రీకాంత్‌రెడ్డి, ఆకుల వెంకటయ్య,ఎండి ఫసియొద్దీన్,ఆకులరాములు,శ్రీనివాసులుగౌడ్,గడ్డంరాములు,పోలీస్ వెంకట్‌రెడ్డి, రమేష్‌చందర్, సత్తూర్ అశోక్‌గౌడ్,గొడుగు వెంకటరాజు,పులగుర్ల మల్లేష్,మొహ్మద్ షాకీర్,గడ్డం యాదయ్య,గడ్డం డీలర్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా తృతీయ మహా సభలు విజయవంతం


మాట్లాడుతున్న టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు

**వనపర్తి ప్రతినిధి, జూలై 24 ప్రభాతవార్త:** టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా తృతీయ మహాసభను విజయవంతం చేయడానికి కృషి చేసిన జర్నలిస్టులు అందరికి నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవరావు, బి.రాజు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సభ నిర్వహణకు పూర్తి స్థాయిలో సహకారం అందించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మహాసభలకు సహకరించడంతో పాటు వనపర్తి నియోజక వర్గ జర్నలిస్టులకు వరాలు కురిపించడం సంతోషకరం అని అన్నారు. ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలంతో పాటు, సొంత నిధులతో హెల్త్ ఇన్సూరెన్స్ కల్పిస్తానని హామీ ఇవ్వడం జర్నలిస్టుల పట్ల తనకున్న అభిమానానికి నిదర్శనమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న మేఘారెడ్డికి జర్నలిస్టులందరం తోడుగా ఉంటాం అభివృద్ధిలోభాగస్వామ్యంఅవుతామని అన్నారు. విలువలతో కూడిన జర్నలిజం చేస్తామని అన్నారు. సభ విజయవంతానికి కృషి చేసిన జిల్లాలోని అన్ని మండలాల జర్నలిస్ట్ మిత్రులకు, యూనియన్ రాష్ట్ర నాయకులకు, సీనియర్ జర్నలిస్టులకు,రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ,రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఏర్పాటు అయిన జిల్లా కార్య వర్గం నిరంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ద్యారపోగు మన్యం, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బెక్కరివిజయ్,బాలరాజు,జిల్లా ఎలక్ట్రానిక్‌మీడియా జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు,నర్సింహారాజు,టౌన్‌అధ్యక్ష,కార్యదర్శులు అరుణ్‌రాజ్‌సిలమర్తి ఆంజనేయులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**కల్వకుర్తి, జూలై 24 ప్రభాతవార్త:** కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌ను గురువారం 11 గంటలకు నాగర్ కర్నూలు జిల్లా ఎస్పీ ఎవరికీ ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్ లోని వివిధ రికార్డులను పరిశీలించారు. తనఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ రిజిస్టర్ తనిఖీ చేసి పోలీస్ స్టేషన్‌కు వచ్చే పిటిషన్‌లను నమోదు చేస్తున్నారా లేదా, రోజుకి ఎన్ని పిర్యాదులు వస్తున్నాయి, వాటిని ఏ విధంగా పరిష్కరిస్తున్నారు అని రిసెప్షన్ మహిళా కానిస్టేబుల్ మహాలక్ష్మిని అడిగి తెలుసుకొని ఎస్పీ తగు సూచనలు సలహాలు ఇచ్చారు. తదుపరి పోలీస్‌స్టేషన్ లాక్ అప్ రూమ్‌ని పరిశీలించారు. లాకప్ రూమ్‌ని ఏ విధంగా నిర్వహిస్తున్నారని డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌ని అడిగి తగిన సూచనలు ఇచ్చారు. పోలీస్‌స్టేషన్‌లోని ఎఎస్సైలతో మాట్లాడుతూ సరిగ్గా లేని పేరు యొక్క ప్లేట్, యూనిఫామ్ సరిగ్గా లేనందున వారికీ వార్నింగ్ ఇచ్చారు. డ్యూటీలో ఉన్న ప్రతి ఒక్కరు యూనిఫామ్‌ని సరిగ్గా సరైన విధంగా నిబంధనలకు అనుగుణంగా ధరించాలని సూచించారు. మళ్ళీ ఇలాంటి తప్పులు చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తదుపరి సిఐ నాగార్జున, డిఎస్పీ వెంకటరెడ్డిలతో మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల జరిగిన దొంగతనాల విచారణ ఎంత వరకు వచ్చిందని తెలుసుకున్నారు. పట్టణంలో జరిగిన దొంగతనాలను చేధించి, దొంగతనాలుజరగకుండా పెట్రోలింగ్ చేయాలనీ సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించి వర్షాకాలంలో పెరిగే పిచ్చి మొక్కలను తొలగించి, దోమలు లేకుండా చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలుశుభ్రంగా ఉంచాలని సూచించారు. కల్వకుర్తి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం, ఇందులో కాలనీలు పెరుగుతుండడంతో కొన్ని కాలనీలు దూరంగా ఉండి జనసంచారం తక్కువగా వున్న ప్రాంతాలలో తప్పకుండ ఆయా కాలనీ ప్రజలు, కాలనీ సంఘాలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేయాలని సూచించారు.



## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

◆ చిన్న పిల్లలతో ఎవరైనా వెట్టిచాకిరి గురి చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు ◆ జిల్లా ఎస్పీ రావుల గిరిధర్


అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ

**వనపర్తి, జూలై24 ప్రభాతవార్త:** వెట్టి చాకిరికి గురౌవుతున్న బాల బాలికలను గుర్తించి వారిని సంరక్షించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి జూలై 1 నుండి ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభమై 20 రోజుల వ్యవధిలో వనపర్తి జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ దిగ్విజయంగా కొనసాగుతుందని, అన్ని శాఖల సమిష్టికృషితో బాల కార్మికవ్యవస్థను సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లాఎస్పీ సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జూలై 1 నుండి పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ వివిధ డిపార్ట్మెంట్ అధికారుల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా టీమ్‌లు ఏర్పాటు చేసి ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. హోటల్లు నందు, ఇటుక బట్టీల నందు, నిర్మాణపనుల నందు,వ్యాపార సముదాయాల నందు పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారిని తల్లిదండ్రులకు గాని సంరక్షణ గృహాలకు కానీ చేర్చి యజమానులపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 7 కేసులను నమోదు చేసినట్లుతెలిపారు. నిరాదరణకు గురైన, తప్పిపోయిన పిల్లలు ఉన్న, వెట్టి చాకిరీకి గురవుతున్న పిల్లలుఉన్న 1098గాని, డయల్ 100కిగాని వారికి సమాచారం ఇవ్వాలని బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ ముస్కాన్ ఎస్సై, రాము, ఏహెచ్‌టియు ఎస్సై, అంజద్,లేబర్ ఆపిసర్,రఫీ, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, రవి రాజు, నరేందర్ హెల్త్ డిపార్ట్మెంట్ వివిధ డిపార్ట్మెంట్ అధికారులు ఆపరేషన్ ముస్కాన్ సిబ్బంది పాల్గొన్నారు.

### విచారణ చేపట్టిన డిఎస్పి

**బిజినేపల్లి, జూలై24 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీరామ మిర్చి బండి వద్ద బాల కార్మికుడితో పనిచేయిస్తున్న సంఘటనపై నమోదైన కేసు పై డిఎస్పి బుర్రి శ్రీనివాస్ గురువారం విచారణ చేపట్టారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఇటీవలే ప్రత్యేక బృందాలు ఆయా దుకాణాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించారు. అందులో భాగంగా నమోదైన కేసుకు సంబంధించి డిఎస్పి బుర్రి శ్రీనివాస్ సమీప దుకాణదారులను విచారించి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎస్సై శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.


విచారణ చేస్తున్న డిఎస్పి బుర్రి శ్రీనివాస్

## స్థానిక సంస్థల ఎలక్షన్లలో గెలుస్తాం

**తెలకపల్లి, జూలై 24 ప్రభాతవార్త:** రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధిస్తుందని బిజెపి మండల ఇన్చార్జ్ ధన్నోజు నరేష్‌చారి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో గలయోగా భవనంలో నిర్వహించిన మండల స్థానిక సంస్థల మండల కార్యశాల సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధిస్తుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మూడో స్థానానికి పడిపోయిందని, కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ప్రజల విశ్వాసం కోల్పోయిందని, ఎట్టి పరిస్థితుల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి ఓట్లేయమని ప్రజలు తనకు ప్రత్యక్షంగా చెబుతున్నారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మంద చిన్నారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రమణరెడ్డి, మండల కో కన్వీనర్ బాబు సాగర్,జిల్లా అధికారప్రతినిధి రవికుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణయ్య, వసంత గౌడ్, రాము, రాజు, భాషమోని రమేష్, కనుక రమేష్, వెంకట్, లక్ష్మణ్, ఈర్లపల్లి శ్రీను, రవి, శివ, భాను, రవి, లక్ష్మణ్, వెంకట్ రెడ్డి, ఆంజనేయులురెడ్డి పాల్గొన్నారు.

## మురుగునీటిని తొలగించాలి

**దామరగిద్ద, జూలై 24 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోని గ్రటేడ్డిపల్లి గ్రామంలో వర్షం పడితే నీళ్లు రోడ్డుపై నిలిచి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. కొందరు వృద్ధులు అక్కడ జారి పడుతున్నారు పైగా వర్షాకాలం కావడంతో ఈగలు, దోమలు వాలి అతిసారం వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఇప్పటికైనా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి మరియు స్పెషల్ ఆఫీసర్ చొరవ తీసుకొని నీరు నిలవకుండా మట్టి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## డైల్ యువర్ డియం కార్యక్రమం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 24 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణ మరియు కోస్గి పరిసర ప్రాంతాల ప్రజలకు కోసం నేడు ఉదయం 11గంటల నుండి 12 గం.ల వరకు డైల్ యువర్ డియం కార్యక్రమము నిర్వహించబడునట్లు డిపో మేనేజర్ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశమును ప్రయాణికులు 73828 26293 నెంబర్‌కు ఫోన్ చేసి తగు సమస్యలు సలహాలు మరియు సూచనలను తెలియజేయలని కోరారు

## మక్తల్ పరివాహక ప్రాంత రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మక్తల్ మార్కెట్ చైర్మెన్ గవినోళ్ళ రాధా లక్ష్మారెడ్డి

**మక్తల్ టౌన్, జూలై 24 ప్రభాతవార్త :** మక్తల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గవినోళ్ళ రాధా లక్ష్మారెడ్డి ప్రజల పట్ల వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని రైతుల వ్యవసాయ మోటార్ల వద్ద లైట్ స్తంభాల వద్ద తడి చేతులతో ముట్టుకోకుండా దూరంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఓ సమావేశంలో తెలియజేశారు. వర్షాకాలంలో, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, నీటి నిర్వహణ, విద్యుత్ పరికరాల వినియోగం విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమనీ జాగ్రత్తలు తీసుకోవడం వలన, సీజనల్ వ్యాధుల నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని విద్యుత్ షాక్ నుండి రక్షణ కోసం తడి చేతులతో ఎలక్ట్రికల్ స్విచ్‌లు, సాకెట్లను ముట్టుకోకుండా జాగ్రత్త వహించాలని ప్రజలందరినీ రైతులను జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు.

## లబ్దిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలి : కలెక్టర్

మొదటి పేజీ తరువాయి భాగం..

మండలంలో కె.జి.బి. వి తనిఖీ చేశారు. కె.జి.బి.వి పరిసరాలు పరిశీలించి చెత్త ఉండడం గమనించి వెంటనే పరిశుభ్రం చేయాలని స్పెషల్ ఆఫీసర్ ను ఆదేశించారు. కె.జి.బి. వి ఆవరణ పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 7 తరగతి విద్యార్థులతో మాట్లాడి బోధన పాఠ్యాంశాలు గురించి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం, గణిత ప్రాథమిక భావనలు నేర్చుకోవాలన్నారు. పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులు, అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజనం పై విద్యార్థులతోచర్చించారు. మధ్యాహ్న భోజనం ను పరిశీలించింది. రోజు మెనూ ప్రకారమే భోజనం అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌వెంట మండల తహశీల్దార్ బి.మల్లికార్జున రావు, మండల అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## అనర్హులకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లపై విచారణ జరపాలి

**ఊట్కూర్, జూలై 24 ప్రభాతవార్త:** అర్హులైన పేద వారికి ఇండ్లు మంజూరుచెయ్యాలి బహుజన సమాజ్ పార్టీ ఊట్కూర్ మండల అధ్యక్షులు కొక్కు గౌతమ్ నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో భాగంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేదలకు కుటుంబాలకు, ఇల్లు లేని నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. కానీ ఇవన్నీ పట్టించుకోకుండాగ్రామ పంచాయతీ అధికారులు, రాజకీయ నాయకులఒత్తిడితో పేదలకుఇవ్వవలసిన ఇండ్లను అర్హతలేని వ్యక్తులకు,ఇదివరకే ఇండ్లు కలిగిన వ్యక్తులకు, అర్హుల జాబితాలో చేర్చుతూ నిరుపేదలకు తీవ్రమైన అన్యాయం చేశారు. అనర్హులకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లపై సమగ్ర విచరణ జరిపి చర్యలు తీసుకొని,అర్హత గల పేదలకు ఇండ్లు మంజూరు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ ఉట్కూర్ మండల అధ్యక్షులు కొక్కు గౌతమ్ మండిపడ్డారు. ఈ విషయాన్ని నారాయణపేట జిల్లా సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

## విద్యార్థులకు ట్రైనీ కలెక్టర్ పాఠాలు

**ఊట్కూర్,జూలై 24 ప్రభాతవార్త:** ఊట్కూరు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ పాఠాలు బోధించారు. గురువారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన ప్రాథమిక పాఠశాలలను సందర్శించి అక్కడి ఉపాధ్యాయులు కాంప్లెక్స్ మీటింగులకు వెళ్లారని తెలిసి ఐదో తరగతి విద్యార్థులకు గణితం క్లాస్ తీసుకున్నారు. 30 నిమిషాల పాటు విద్యార్థులతో ముచ్చటించి వారి అభ్యసనా సామర్థ్యాలను వెలికి తీశారు. ఇతర తరగతి గదులను పరిశీలించారు.


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ట్రైనీ కలెక్టర్

## కుట్టు మిషన్ల పంపిణీలో గందరగోళం

### కమిషనర్ ఆఫీస్ ముట్టడించిన బాధితులు

**మద్దూర్, జూలై 24 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేణివట్లలో ఈనెల 21వ తేదీ రోజు మైనారిటీలకు కుట్టు మిషన్ల పంపిణీలో ప్రొసీడింగ్లు ఇచ్చి కొంత మందికి పంపించక పోవడంతో గురువారం మున్సిపల్ కమిషనర్ ఆఫీస్‌లో మైనారిటీ మహిళలు కమిషనర్ చాంబర్లో బైఠాయించారు. మాకు ప్రొసిడింగ్లు ఇచ్చిఎందుకు మిషన్లు పంపిణీ చేయలేదని అధికారులను నిలదీశారు. అందుబాటులో కమిషనర్ లేకపోవడంతో కొద్దిసేపు రభస జరిగింది. అందుబాటులో ఉన్న అధికారులతో మాట్లాడిఅక్కడి నుంచిమహిళలు వెనుదిరిగారు. కమిషనర్ వివరణపైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికి పంపిణీ చేయడం జరిగిందని కమిషనర్ తెలిపారు. నేను ఎవరికైతే ప్రొసీడింగ్ ఇచ్చాను వారికి పంపిణీ చేయడం జరిగిందని కమిషనర్ తెలిపారు.

## ఘనంగా నిర్వహించిన టియూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా తృతీయ మహాసభలు

**శ్రీరంగాపూర్, జూలై 24 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా తృతీయ మహాసభలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా వనపర్తి జిల్లా నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా శ్రీరంగాపూర్ మండలం ప్రెస్‌క్లబ్ నుంచి చీరల శివసాగర్, వనపర్తి జిల్లా సహాయక కార్యదర్శిగా నరేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ విలేకరుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూవిలేకరుల హక్కుల సాధన కోసం పనిచేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల విలేకరుల బృందం వారిని శాలువతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేయడం జరిగింది.

## ఆంజనేయస్వామికి అభిషేకాలు

**ధన్వాడ, జూలై 24 ప్రభాతవార్త:** ధన్వాడ మండల కేంద్రంలోని బూర్జుగడ్డఆంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ఆలయంలో పాలాభిషేకంతో పూజలు నిర్వహించారు. భకులుతీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమంలో మత్స్యపారిశ్రామిక సహకారసంఘం జిల్లాఉపాధ్యక్షులు నీరటి నరసింహులు నాయుడు ముదిరాజ్, నర్సింహులు, నాగరాజు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**దామరగిద్ద, జూలై24 ప్రభాతవార్త :** బోనాల ఉత్సవాల భాగంగా ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొనేందుకు వెళ్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ పై దుండగుల దాడిని జాతీయ మాలల ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ గ్యాంగ్ హనుమంతు ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాడి చేసిన దుండగులను చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎమ్మెల్యే గణేష్‌కు పటిష్టమైన భద్రత కల్పించాలన్నారు.

## పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

**బిజినేపల్లి, జూలై24 ప్రభాతవార్త:** వట్టెం గ్రామంలో కలుపు మందు పిచికారితో ఎండిపోయిన రైతుల మొక్కజొన్న పంట పొలాలను శాస్త్రవేత్తలు శశిభూషణ్ చరణ్ తేజ పరిశీలించారు. రైతులు మావిళ్ళ శ్రీను, చాకలి భీమయ్య రైతులకు సంబంధించిన మొక్కజొన్న పంటలో కలుపు మందు పిచికారితో ఎండు దశకు చేరాయని శాస్త్రవేత్తలకు సూచించారు. పంట నష్టపోవడానికి గల కారణాలను గుర్తించేందుకు శాస్త్రవేత్తలు రైతుల నుంచి వివరాలు సేకరించారు. రైతులు పంట సాగుచేసిన తేదీ,ఏ రకమైన మొక్కజొన్న పంట, కలుపు మందు ఏ మోతాదులో పిచికారీ చేశారో వివరాలు సేకరించారు. సంబంధితమందుల వివరాలు తెలుసుకున్నారు. పూర్తి వివరాలను పరిశీలించి రైతుకు వివరాలను వెల్లడిస్తామనిశాస్త్రవేత్తలు తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పూర్ణచందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్ ఏఈఓ భార్గవ్ సాగర్ ఉన్నారు.

## అల్ట్రా పోర్టబుల్ డిజిటల్ ఎక్స్ రే మిషన్‌ను ప్రారంభించిన కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 24 ప్రభాతవార్త:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అల్ట్రా పోర్టబుల్ డిజిటల్ ఎక్స్ రే మిషన్‌ను గురువారం ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ అల్ట్రా పోర్టబుల్ డిజిటల్ ఎక్స్ రే మిషన్ ను ఉపయోగించి జిల్లాలో నిర్వహిస్తున్న టీబి ముక్తభారత్ అభియాన్ క్యాంపులకు వచ్చే రోగులకు ఉచితంగా ఎక్స్రే తీసి వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్‌ఓ కె.జయచంద్ర మోహన్‌ను ఆదేశించారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్టాఫ్ నర్స్, ఎమ్ ఎల్‌హెచ్ పి =లకు నిర్వహిస్తున్న శిక్షణ గురించి వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ శిక్షణ ద్వారా మీరు ఏమి నేర్చుకున్నారు ప్రజలకు ఫీల్డ్ లో ఎలా సేవలు అందిస్తారని వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విజయ్ కుమార్ ఎంపిహెచ్‌ఈఓ, అశోక్ కుమార్ ఎంపిహెచ్‌ఈఓ, బిక్షపతి డిపిఓ, శ్రీధర్ ఎస్‌టిఎల్‌ఎస్, ఆఫీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.